


# సూర్య

ప్రతి దినపత్రిక

గుంటూరు పల్నాడు

www.suryaa.com

బుధవారం 26 నవంబర్ 2025 - పేజీలు 11


- సమస్యల పరిష్కారానికి మంత్రి లోకేష్ చొరవ
- టీడీపీ కేంద్ర కార్యాలయంలో 75వ రోజు ప్రజాదర్బార్
- పెద్దఎత్తున తరలివచ్చిన ప్రజలు, పార్టీ కార్యకర్తలు
- స్వయంగా కలిసి అర్జీలు స్వీకరించిన మంత్రి

## అండగా ఉండి

# ఆదుకుంటామని భరోసా..!



**మంగళగిరి, మేజర్ న్యూస్:** టీడీపీ కేంద్ర కార్యాలయంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ 75వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. మంత్రి లోకేష్ ను కలిసి స్వయంగా సమస్యలు విన్నవించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించిన మంత్రి లోకేష్ వివిధ సమస్యలతో బాధపడుతున్న వారి నుంచి వినతులు స్వీకరించారు. పలు సమస్యల త్వరితగతిన పరిష్కారానికి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

### రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన విజ్ఞప్తులు

- టీడీపీ సానుభూతిపరుడిననే కక్షతో గత వైసీపీ ప్రభుత్వ పాలనలో తనపై అక్రమ కేసులు బనాయించి కుటుంబాన్ని క్షోభకు గురిచేశారని, విచారించి కేసుల ఎత్తివేతకు చర్యలు తీసుకోవడంతో పాటు ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లకు చెందిన జరుగుళ్ల గురుమూర్తి మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు.
- పీజీ చదివిన తనకు ఉద్యోగ అవకాశం కల్పించి ఆదుకోవాలని కర్నూలు జిల్లా శిరివెళ్ల మండలం గోవిందపల్లెకు చెందిన పగిడి వెంకటలక్ష్మి మంత్రి నారా లోకేష్ ను కలిసి కోరారు.
- గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కురగల్లులోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో 70 మంది కలిసి పొదుపు చేసిన

2లో



## ఇదేమి నిర్వహణ..

# రోగులను ఇలా ఇబ్బంది పెడతారా..!

- ఏరియా వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన
- డి.సి.హెచ్.ఓ ప్రసన్న

**సత్తెనపల్లి, మేజర్ న్యూస్:** ఇదేమి నిర్వహణ,రోగులను ఎంతసేపు లైన్లో నిలబెడతారు, జవాబు దారితనం లేకపోతే ఎలా అంటూ ప్రభుత్వ వైద్యశాలల సమన్వయకర్త ప్రసన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని జిల్లా

వివరాలు 2లో...

## తెనాలిలో

# రీబూట్ షార్ట్ ఫిలిం

2లో..

## తీగ లాగితే..

# డొంక కదులుతోంది..!

2లో..

## అంతర్గత డ్రైన్లు

# శుభ్రం చేయాలి

2లో..

- నగరంపాలెం సెంటర్లో అవగాహన మానవహారం
- జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కే ఖాజావలి

## లింగ సమానత్వం ద్వారానే

# మహిళా సాధికారిత సాధ్యం



**గుంటూరు, కలెక్టరేట్ మేజర్ న్యూస్:** లింగ సమానత్వం ద్వారానే మహిళా సాధికారిత సాధ్యమవుతుందని జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కే ఖాజావలి అన్నారు. "మంగళవారం అంతర్జాతీయ మహిళలపై హింస వ్యతిరేక దినోత్సవం" సందర్భంగా జిల్లా కలెక్టరేట్ వద్ద డీఆర్డీఏ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీని జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కే ఖాజావలి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ మహిళలపై దాడులు అరికట్టడానికి, లింగ వివక్షతను నిర్మూలనపై అవగాహన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నెల రోజుల పాటు కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. రాష్ట్రంలో నేటి నుంచి డిసెంబర్ 23వ తేదీ వరకు జిల్లా, మండల , గ్రామ స్థాయిలో మహిళా సాధికారతపై అవగాహన సదస్సులు జరుగుతున్నాయని, దీనిలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాస్థాయిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. మహిళలపై వివక్షత లేకుండా సమాన అవకాశాలు కల్పించాలన్నారు. పాఠశాల స్థాయి నుంచి స్త్రీ, పురుషులు సమానమని తెలియజేయా లన్నారు. ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లోను రాణిస్తున్నారు అని తెలిపారు. మహిళలపై దాడులు అరికట్టడంతో పాటు వారికి స్వేచ్ఛ, సురక్షిత వాతావరణం కల్పించడానికి ప్రతి

2లో

## బైక్ దొంగతనాలు, అక్రమ గంజాయి కేసులో

# నలుగురు అరెస్ట్

- వివరాలు వెల్లడించిన సౌత్ డిఎస్పి



గుంటూరు జిల్లా క్రైమ్, మేజర్ న్యూస్: బైక్ దొంగతనాలతో పాటు అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న కేసుకు సంబంధించి నలుగురు వ్యక్తులను మంగళవారం నల్లపాడు పోలీసులు అరెస్ట్ చేశారు. వారిలో ఇద్దరు మహిళలు ఒక బాలుడు ఉండటం గమనార్హం. అరెస్టు వివరాలను సౌత్ డిఎస్పి భానోదయ స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. గుంటూరు నగర శివారు పొన్నూరు రోడ్డు ఐ పి డి కాలనీ ఒకటవ లైన్ కు చెందిన షేక్ ఖాజావలి ఒక బాలుడు ఇరువురు చెడు వ్యసనాలకు బానిసలైనారు. తేలికగా డబ్బులు సంపాదించాలని ద్విచక్ర వాహనాలు చోరీ చేయటం మొదలుపెట్టారు. ఖాజావలి బైక్ చోరీకి తన భార్య మిన్నీ, అత్త రేణుక ల ఎంతో బైక్లను చోరీ చేయటం మొదలుపెట్టాడు. ఇటీవల చౌడవరం దాసరిపాలెం ప్రాంతంలో వరుసగా సుజుకి యాక్సెస్ బైకులు చోరీకి గురయ్యాయి. ఈ నేపద్యంలో నల్లపాడు పోలీసులు కేసును సీరియస్ గా తీసుకున్నారు. సీ సి ఫుటేజ్ ద్వారా చోరీ చేసే వ్యక్తులను గుర్తించారు. వీరు వీళ్లు మొత్తం 19 బైకులలో అధికంగా నల్లపాడు స్టేషన్ 11, మేడికొండూరు స్టేషన్ 3 చోరీ చేశారు. మిగిలినవి ఇతర పోలీస్ స్టేషన్

2లో

# అండగా ఉండి ఆదుకుంటామని భరోసా..!

మొదటి పేజీ తరువాయి





రూ.7.55 కోట్ల నగదును సీఈవో దుర్వినియోగం చేశారని, విచారించి తగిన చర్యలు తీసుకోవాలని సంఘ సభ్యులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విన్నవించారు.

– గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గం పెదవడ్లపూడిలో తమ 0.39 ఎకరాల వ్యవసాయ భూమిని వెబ్ ల్యాండ్ లో నమోదుకు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన కుర్రా వెంకట్రావు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు.

– రాష్ట్రంలో రిటైర్డ్ పార్ట్ టైం ప్రభుత్వ ఉద్యోగులకు ప్రస్తుతం చెల్లిస్తున్న రూ.4వేల పెన్షన్ ను రూ.10వేలకు పెంచాలని ఏపీ రిటైర్డ్ పార్ట్ టైం వీఏవో, పీటీఏ, వీఆర్వోస్ ఫెడరేషన్ ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు.

– అనారోగ్యంతో బాధపడుతున్న తమ కుమారుడి వైద్య చికిత్సకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని విజయనగరం జిల్లా గరుగుబిల్లి మండలం ఉద్దవోలు గ్రామానికి చెందిన వి.నాగభూషణం మంత్రి నారా లోకేష్ ను కలిసి కోరారు.

– దివ్యాంగురాలినైన తాను జీవనోపాధి కోసం ఓ ప్రైవేటు పాఠశాలలలో టీచర్ గా పనిచేస్తున్నానని, దైనందిన జీవితం కోసం ట్రై స్కూటీ అందజేసి ఆదుకోవాలని పల్నాడు జిల్లా దాచేపల్లికి చెందిన షేక్ సుభాన్ బి మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు.

– పూర్తి అంగవైకల్యంతో బాధపడుతున్న తనకు రూ.15వేల పెన్షన్ అందించి అండగా నిలవాలని అనంతపురం జిల్లా గుత్తి పట్టణానికి చెందిన వై.మహాలక్ష్మి మంత్రి నారా లోకేష్ ను కలిసి విన్నవించారు. ఆయా విజ్ఞప్తులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

# గంజాయి బైక్ దొంగతనాలు కేసులో నలుగురు అరెస్ట్

మొదటి పేజీ తరువాయి

పరిధిలో దొంగిలించారు. అనంతరం ఆ బైకులను లంబసింగి ప్రాంతానికి వెళ్లి విక్రయించేవాళ్లు. వచ్చిన సొమ్ముతో గంజాయి కొని గుంటూరు తీసుకువచ్చి ఇక్కడ పొట్లాలు చేసి అమ్మేవారు. విశ్వసనీయ సమాచారం మేరకు నల్లపాడు సిఐ వంశీధర్ ఆధ్వర్యంలో పోలీసు బృందం గాలింపు చేపట్టింది. పెదపలకలూరు సమీపంలో నిందితులు ఉన్నట్లు పోలీసులు గుర్తించి అరెస్ట్ చేశారు. వారి నుంచి 5 కేజీలు గంజాయి, 19 బైకులను స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్పి వివరించారు. కేసులో ప్రతిభ కనబరిచిన నల్లపాడు స్టేషన్ సిఐ వంశీధర్, ఎస్సై పి మహేష్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావు, కానిస్టేబుల్ భిక్షనాయక్, షేక్ మస్తాన్ వలి, టి సాంబశివరావు లను డిఎస్పి అభినందించారు.

# తీగ లాగితే...డొంక కదులుతోంది..!

**-మంగళగిరి, కురగల్లు సొసైటీల అవినీతి వ్యవహారంపై కొనసాగుతోన్న విచారణ**

**మంగళగిరి, మేజర్ న్యూస్:** మంగళగిరి, కురగల్లు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో జరిగిన అవినీతి వ్యవహారంపై తీగ లాగితే డొంక కదులుతోంది. గత నెల అక్టోబర్ 20వ తేదీన మంగళగిరి మండలం కురగల్లు కు చెందిన తాడి బోయిన హనుమంతరావు, సురేష్ అనే రైతులు రూ.90లక్షల ఫిక్సిడ్ డిపాజిట్ ను రద్దు చేసుకుని నగదు తీసుకునేందుకు పీఏసీఎస్ కు వెళ్లగా ఫిక్సిడ్ డిపాజిట్ బాండ్ నకిలీదని తేలడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. అదే విధంగా నవంబరు 11వ తేదీన కుక్కల సహదేవరావు అనే రైతు మంగళగిరి పీఏసీఎస్ లో తాను ఫిక్సిడ్ చేసిన రూ.30.50 లక్షలు, బత్తుల వెంకటేశ్వరరావు ,పార్వతీ దంపతులు రూ.90 లక్షలను విత్ డ్రా చేసుకునేందుకు వెళ్లాడు. అయితే అతని ఖాతాలో నగదును అంతకు కొన్ని రోజుల ముందే సీఈఓ రమేష్ నకిలీ ఫిక్సిడ్ డిపాజిట్ బాండ్ తో డ్రా చేసినట్లు విచారణలో తేల్చారు. మంగళగిరి పీఏసీఎస్ లో జరిగిన కుంభకోణం వ్యవహారంపై గత నెల 27వ తేదీన మంగళగిరి పీఏసీఎస్ అధ్యక్షుడు గాదె పిచ్చి రెడ్డి మంగళగిరి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా కురగల్లు పీఏసీఎస్ లో జరిగిన కుంభకోణం పై గత నెల 30వ తేదీన అధ్యక్షులు శీలం గోపయ్య మంగళగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**కొనసాగుతోన్న విచారణ...**

మంగళగిరి, కురగల్లు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో జరిగిన కుంభకోణంపై జీడీసీసీ జాయింట్ రిజిస్ట్రార్ ఉమాదేవి నేతృత్వంలో సమగ్ర విచారణ జరుగుతున్నట్లు జీడీసీసీ బ్యాంక్ మంగళగిరి బ్రాంచ్ చీఫ్ మేనేజర్ పి. శ్రీలక్ష్మి మంగళవారం తెలిపారు. మండలంలోని కురగల్లు పీఏసీఎస్ లో 75 మంది రైతులకు చెందిన 112 ఫిక్సిడ్ డిపాజిట్లకు సంబంధించి రూ. 8.50 కోట్లు, మంగళగిరి పీఏసీఎస్ లో నలుగురు రైతులకు చెందిన ఫిక్సిడ్ డిపాజిట్లకు సంబంధించి రూ.1.28 కోట్లు గోల్ మాల్ జరిగినట్లు అధికారికంగా గుర్తించినట్లు ఆమె తెలిపారు. కాగా మంగళగిరి పట్టణ, రూరల్ పోలీసులు ఆయా పీఏసీఎస్ సిబ్బందిని విచారిస్తున్నట్లు తెలిసింది.




# తెనాలిలో రీబూట్ షార్ట్ ఫిలిం ప్రారంభం

మొదటి పేజీ తరువాయి

**తెనాలి, మేజర్ న్యూస్ :** రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జరుగనున్న లఘు చిత్ర పోటీలకు పంపేందుకు ఈదర టాకీస్ బ్యానర్ పై నిర్మిస్తున్న రీబూట్ షార్ట్ ఫిలిం షూటింగ్ చినరావూరులో మంగళవారం ప్రారంభించారు. స్థానిక చినరావూరులోని వాసిరెడ్డి నాగేశ్వరరావు గృహ ఆవరణలో నిర్మిస్తున్న చిత్రంలో నూతన, పాత నటీనటులు సందడి చేశారు. షార్ట్ ఫిలిం నిర్మాత ఈదర పూర్ణచంద్ సారధ్యంలో, కనపర్తి రత్నాకర్ దర్శకత్వంలో ప్రారంభమైన ఈ షూటింగ్ ను రంగస్థల కళాకారుల సంఘం అధ్యక్షురాలు బుర్రా జయలక్ష్మి క్లాప్ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా బుర్రా జయలక్ష్మి మాట్లాడుతూ సందేశాత్మక లఘు చిత్రాలు సమాజానికి మేలు చేస్తాయని అన్నారు. కళల కాణాచి గా పేరుగాంచిన తెనాలి నటీ నటులతో తెనాలి లో షూటింగ్ జరుపుకోవడం సంతోషకరమన్నారు. చిత్ర దర్శకులు రత్నాకర్ మాట్లాడుతూ విద్య, సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేస్తే ఏర్పడే పరిణామాలను ఇతివృత్తంగా తీస్తున్న ఈ చిత్రం మంచి హిట్ అవుతుందని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. ఈ చిత్రానికి దర్శకత్వం వహించే అవకాశం తనకు ఇచ్చినందుకు నిర్మాతలకు కృతజ్ఞతలు తెలిపారు. చిత్ర నిర్మాత ఈదర వెంకట పూర్ణచంద్ మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగే లఘు చిత్రాల పోటీలకు తెనాలి రోటరీ క్లబ్ వైకుంటపురం 3150 తరపున పోటీలకు పంపించేందుకు రీబూట్ లఘు చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. యువతకు నిర్దిష్ట ఇతివృత్తాన్ని తెలియజేసే ప్రయత్నమే రీబూట్ లఘు చిత్రం ధ్యేయం అన్నారు. దేవి తేజస్వి, సిహెచ్ శేఖర్, వసంత యామిని, సోమేశ్, అయినాల మల్లేశ్వరరావు, కె మధుకర్, బెల్లంకొండ వెంకట్, జి. కోటేశ్వరరావు, సిద్దార్థ, కె గోపి, వి సిద్దార్థ, బద్రీనాథ్, ఎస్ శ్రీనివసరావు, మోజెస్ తదితరులు నటించినారు. రమణ, చిత్రానికి డిఓపి గా రవి, అసోసియేట్ డైరెక్టర్ గా రమణ వ్యవహరించారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు నల్లూరు వెంకటేశ్వరరావు, ఈదర శ్రీనివాసరావు, మల్లాది అర్జున్, గుత్తా వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు.



## ఇదేమి నిర్వహణ..రోగులను ఇలా ఇబ్బంది పెడతారా..!

మొదటి పేజీ తరువాయి

వైద్యశాల సమన్వయకర్త ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులు క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉండటం, వైద్యులు అందుబాటులో లేకపోవడంపై ఆమె తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. విధుల్లో ఉండాల్సిన సెక్యూరిటీ గార్డులు తమ స్థానాల్లో లేకపోవడాన్ని గుర్తించి, వారి పనితీరుపై మండిపడ్డారు. ఆసుపత్రిలో ఎవరి ఇష్టానుసారం వారు వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని, బాధ్యతాయుతంగా పనిచేయాలని హెచ్చరించారు. ఎవరికి కేటాయించిన విధుల్లో వారు ఉండాలని, రోగులను ఎక్కువసేపు నిలబెట్టకూడదని సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యశాల పరిరక్షితులు వైద్యశాల పర్యవేక్షకులు, వైద్యులు తదితరులున్నారు.

## లింగ సమానత్వం ద్వారానే మహిళా సాధికారిత సాధ్యం

మొదటి పేజీ తరువాయి



ఒక్కరు కృషి చేయాలి అన్నారు. డి ఆర్ డి ఏ పీడి విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రపంచ మహిళలపై హింస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నెలరోజుల పాటు లింగ సమానత్వం పై రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు అన్నారు. లింగ వివక్షతను అరికట్టడానికి సమాజంలో అవగాహన కోసం ప్రతిరోజు ఒక అంశం తో జిల్లా, మండల , గ్రామస్థాయిలో వివిధ రకాల కార్యక్రమాలను డిసెంబర్ 23వ తేదీ వరకు నిర్వహిస్తున్నామన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, విద్యాసంస్థల్లో లింగ సమానత్వం పై అవగాహన కార్యక్రమాలు విస్తృతస్థాయిలో నిర్వహిస్తామని వివరించారు. గతంలో కంటే ఇప్పుడు మహిళలు మెరుగైన సమాజం ఉన్నప్పటికీ ఆర్థిక స్వాతంత్రం అనేది ఇంకా పూర్తిస్థాయిలో లేదాన్నారు. మహిళలకు సమాన అవకాశాలు కల్పించడం ద్వారా వారి ఉపాధి అవకాశాలను పెంపొంది, సాధికారిత దిశగా ముందుకు సాగుతారని ఆకాంక్షించారు.కలెక్టరేట్ నుంచి ప్రారంభమైన ర్యాలీ నగరంపాలెం సెంటర్లో మానవహారం నిర్వహించి జెండర్ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకా, ఐసిడిఎస్ పీడీ ప్రసునా, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు చెన్నయ్య, ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్ఈ కళ్యాణ చక్రవర్తి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ నజీమా బేగం, స్వచ్ఛంద సేవా సంస్థలు ప్రతినిధులు, అంగన్వాడి కార్యకర్తలు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంతర్గత డ్రైన్లు శుభ్రం చేయాలి

**– కమిషనర్ పులి శ్రీనివాసులు**



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** నగరపాలక సంస్థ పరిధిలోని వార్డ్ సచివాలయాల వారీగా ప్రజారోగ్య కార్మికులు ప్రతి రోజు మధ్యాహ్న సమయంలో తప్పనిసరిగా తమకు కేటాయించిన ప్రాంతంలో అంతర్గత డ్రైన్లను శుభ్రం చేయాలని నగర్ కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఎస్ఎస్ ల వారీగా కేటాయించిన గ్రాస్ కటింగ్ మెషిన్ లతో డ్రైన్ల వెంబడి గడ్డి, పిచ్చి మొక్కల శుభ్రంపై శానిటేషన్ కార్యదర్శులు, ఇన్స్పెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని నగర కమిషనర్ ఆయన ఆదేశించారు. మంగళవారం కమిషనర్ బ్రాడీపేట, లక్ష్మీపురం, అరండల్ పేట ప్రాంతాల్లో పర్యటించి, పారిశుధ్య, అభివృద్ధి పనులను పరిశీలించి, సంబందిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ డ్రైన్లలో పూడిక తీయడం లేదని, మురుగు నిలిచి దోమలు, దుర్వాసన వస్తుందని ప్రజల నుండి ఫిర్యాదులు అందుతున్నాయని, ప్రతి సచివాలయం పరిధిలో డ్రైన్ల శుభ్రంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఎక్కడైనా డ్రైన్ బ్లాక్ అయితే అదనపు కార్మికుల కేటాయించుకొని పూడికతీయాలని, తీసిన పూడికను వెంటనే తొలగించాలన్నారు. అలాగే ఎస్ఎస్ ల వారీగా 5 గ్రాస్ కటింగ్ మెషిన్లను కేటాయించామని, వాటి ద్వారా డ్రైన్ల వెంబడి గడ్డి, పిచ్చి మొక్కలను తొలగించాలని ఆదేశించారు. లాడ్జి సెంటర్ నుండి బ్రాడీపేట 14వ అడ్డరోడ్ వరకు పర్యటించి, రోడ్ కి ఇరువైపులా నూతన డ్రైన్ నిర్మాణంకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను, ర్యాంప్ లు, ఆక్రమణలను తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. అనంతరం అరండల్ పేట మెయిన్ రోడ్ లో శంకర్ విలాస్ ఆర్ఓబీ నిర్మాణ పనులను పరిశీలించి, రోడ్ విస్తరణకు అంగీకారం తెలిపిన భవనాలను తొలగించాలన్నారు. పర్యటనలో సిటి ప్లానర్ రాంబాబు, ఎస్ఈ(ఇంచార్జి) సుందర్రామిరెడ్డి, ఈఈలు కోటేశ్వరరావు, వేణుగోపాల్, డిఈఈ సతీష్ కుమార్, ఏసిపి రెహ్మాన్, ఎస్ఎస్ ప్రసాద్, కార్పొరేటర్ ఈ.వెంకట కృష్ణ, ఇంజినీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కరపత్రాల పంపిణీ



**వినుకొండ మేజర్ న్యూస్:** వినుకొండ నియోజకవర్గం లోని వినుకొండ మండలం నడిగడ్డ గ్రామంలో రైతుల కోసం నిర్వహించినటువంటి రైతన్న మీకోసం అనే కార్యక్రమంలో నడిగడ్డ గ్రామానికి సంబంధించిన వి ఏ ఏ పురుషోత్తం రెడ్డి ఎఫ్ఎస్సి రాజారెడ్డి ఆధ్వర్యంలో గ్రామానికి సంబంధించిన రైతులు ట్రైనింగ్ ఐసిఆర్పి గాజుల ఇందిరా ఈ కార్యక్రమంలో పాల్గొని రైతన్న ఉద్దేశించి రైతన్న మీకోసం కరపత్రాల పంపిణీ చేయటం జరిగి దీనిని ఉద్దేశించి ట్రైనింగ్ ఐ సి ఆర్ పి ఇందులో మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల ప్రకృతికే కాదు భూమికి కూడా నష్టం కలగకుండా ఉంటుందని రసాయనిక విలువలు వాడటం వల్ల భూమి పాడైపోవడమే కాకుండా దానిలో పండించిన పంటను తినటం వల్ల ప్రజలు కూడా ఆరోగ్యాలు పాడైపోతాయని తెలియజేశారు భూమిలో ప్రకృతి మనకు వరమే ప్రకృతిలో మనకు దొరికే వాటితోనే కషాయాలు తయారు చేసుకుని వాడటం వల్ల భూమి ఆరోగ్యవంతంగా ఉండటమే కాకుండా ప్రజల ఆరోగ్యాలు కూడా కాపాడతాయని ఇందిరా తెలియజేశారు ఈ కార్యక్రమంలో రైతులు అగ్రికల్చర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి శస్త్ర చికిత్సలు



**యడ్లపాడు(చిలకలూరిపేట), మేజర్ న్యూస్:** చిలకలూరిపేట పట్టణంలో గత ఆదివారం ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రతిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొట్టమొదటిసారిగా ఆర్టీసీ ఉద్యోగులు మరియు వృద్ధుల కోసం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో శంకర వైద్యశాల వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి వైద్య సలహాలు అందించారు.పరీక్షల్లో కంటి ఆపరేషన్ అవసరమని తేలిన వారిని శంకర వైద్యశాలలో శస్త్రచికిత్స కోసం ఎంపిక చేసి, సురక్షితంగా ఆస్పత్రికితరలించారు. శస్త్రచికిత్స పూర్తయినఅనంతరం రోగులను క్షేమంగా తిరిగి చిలకలూరిపేటకు తరలించి ఆర్టీసీ బస్టాండ్ వద్ద వారి గమ్యస్థానాలకు సౌకర్యవంతంగా చేర్చేలా శ్రద్ధ చూపారు.ఈ శిబిరం సఫలీకృతం కావడానికి క్యాంపు కన్వీనర్ కంచర్ల శ్రీనివాసరావు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఆర్టీసీ ఉద్యోగులు మరియు వృద్ధులు ఈ సేవలపైసంతోషం వ్యక్తం చేశారు.

# నరసరావుపేటలో ట్రాక్టర్ బైకు ర్యాలీను జయప్రదం చేయండి



**వినుకొండ మేజర్ న్యూస్:** మంగళవారం వినుకొండ లో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం వినుకొండ నియోజకవర్గం అధ్యక్షుడు కాకర్ల కొండలు అధ్యక్షతన రైతులతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము పాల్గొని మాట్లాడుతూ మోడీ గారు 2014వ సంవత్సరంలో మేము అధికారంలోకి వస్తే రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పి ఇప్పటికి 12 సంవత్సరాలయింది ఈరోజుకి రైతుల ఆదాయం రెట్టింపు కాలేదు కానీ రైతుల ఆత్మహత్యలు రెట్టింపైనాయని రైతులు వాడే ఎరువులు ధరలు రెట్టింపైనాయని కార్మికుల హక్కులను హరింపజేసే లేబర్ కోళ్లను తీసుకొచ్చి కార్మికుల స్వేచ్ఛను కాలరాయాలని చూస్తున్నారని వీటన్నిటి పైన రేపు జరిగే కర్షక కార్మికుల ట్రాక్టర్ బైక్ ర్యాలీలను పల్నాడు జిల్లా రైతులు కార్మికులు జయప్రదం చేయాలని రాము కోరారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు కాకర్ల వెంకటేశ్వర్లు పెద్దారావు బ్రహ్మం లక్ష్మి భద్రయ్య వెంకటేశ్వర్లు ఏడుకొండలు కిరణ్ రామయ్య సుబ్బారావు నాగయ్య మల్లయ్య నరసయ్య తదితరులు పాల్గొన్నారు .

# 9వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

**– సిపిఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర నాయకులు లోకం భాస్కరరావు**



**దుగ్గిరాల, మేజర్ న్యూస్:** 9వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని దుగ్గిరాల మండల గ్రామాల్లో ప్రచారాన్ని సిపిఐ ఎం ఎల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లోకం భాస్కరరావు చేపట్టారు . ఓట్ చోర్ , గద్దీ చోడ్ , ఓట్ల దొంగలు గద్దె దిగాలి, కార్పొరేట్ మతతత్వ మనువాద శక్తులను ప్రతికటిద్దాం అనే నినాదాలతో భాస్కర్ రావు పిలుపునిచ్చారు. సమానత్వం ప్రజాస్వామ్యం వర్ధిల్లే ఆంధ్రప్రదేశ్ నిర్మాణం కోసం డిసెంబర్ 6, 7 తేదీల్లో కడప పట్టణంలో సిపిఐ ఎంఎల్ లేబరేషన్ 9 రాష్ట్ర మహాసభ. లుజరుగుతున్నట్లు తెలిపారు .విభజన హామీలు లోభాగమైన ఆంధ్రప్రదేశ్ కుప్రత్యేక హెూదా ఇవ్వాలని ,రాయలసీమ ఉత్తరాంధ్ర ప్రాంతాలను అభివృద్ధి చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను , వైద్య విద్య రంగాలను ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆదివాసీల భూముల రక్షణ కోసం జాతీయ ఉపాధి పథకాన్ని మెరుగైన పద్ధతిగా చేసి ఆ పథకం పట్టణ కార్మికులకు వర్తింపజేయాలని కోరారు .కడపలో జరిగే మహాసభలను జయప్రదం చేయటానికి, ఆర్థిక సహకారాన్ని అందించాలని సిపిఐ ఎంఎల్ రాష్ట్ర నాయకులు లోకం భాస్కరరావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ఆర్.వి.ఆర్‌లో అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవం




**గుంటూరు రూరల్, మేజర్ న్యూస్:** ప్రతి రంగంలో మహిళలు అగ్ర స్థానంలో సేవలందిస్తున్నారని, స్త్రీల పై వివక్ష విడనాడి పురుషునితో సమానంగా సముచిత స్థానం కల్పించినప్పుడే ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుందని ఆర్.వి.ఆర్ %౮% జె.సి. ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షులు డా. రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డా. జగదీష్ కె. మద్దినేని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం చౌడవరంలోని ఆర్.వి.ఆర్ %౮% జె.సి. ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాల ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం, ర్యాలీని నిర్వహించారు. మహిళా భద్రత, రక్షణకు ప్రభుత్వాలు అనేక కఠిన చట్టాలు తీసుకొచ్చాయని, వీటి పై ప్రతిఒక్కరికి అవగాహనను కల్పించాలని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా వుండాలని, విద్యార్థినులు తమ వ్యక్తిగత సమాచారాన్ని డిజిటల్ మీడియాలో పొందుపరహకుండా గోప్యంగా ఉంచుకోవాలని కళాశాల సెక్రటరీ %౮% కరెస్పాండెంట్ రాయపాటి గోపాల కృష్ణ,ట్రెజరర్ డా.కొండబోలు కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.కొల్లా శ్రీనివాస్, కళాశాల అకడమిక్ అండ్ ఆర్ డి డైరెక్టర్ డా. కె.రవీంద్ర, కళాశాల ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ కన్వీనర్ డా.జి.సుధా వాణి, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.




# ఉచిత నేత్ర, దంత వైద్య శిబిరం

**తాడికొండ మేజర్ న్యూస్:** భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారి వారోత్సవాల సందర్భంగా మంగళవారం నాడు తాడికొండ మెయిన్ సెంటర్ నందు ఉచిత కంటి మరియు దంత వైద్య శిబిరం భగవాన్ శ్రీ సత్య సాయి బాబా డిగ్రీ కళాశాల వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆంధ్ర ప్రదేశ్ ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ ఎం సుధాకర్, మరియు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ దివ్య తేజ మూర్తి ప్రారంభించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో సుమారు 300 మందికి ఉచిత కంటి మరియు దంతాలకు వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించి, వారికి పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రధానోపాధ్యాయులు ఎన్ఎంఎస్ లత, అధికారులు వేణుబాబు,ఎస్కే సల్మా ,కళాశాల ఎన్ఎస్ఎస్ క్యాండిడేట్లు పాల్గొన్నారు.

# మద్యం కేసులోని నలుగురు బైండోవర్



**వినుకొండ మేజర్ న్యూస్:** వినుకొండ నియోజకవర్గం లోని ఈపూరు మండలం ఈపూర్ ప్రొహిబిషన్ మరియు ఎక్సైజు స్టేషన్ మద్యం కేసులలో వున్న రొంపిచర్ల మండలం విప్పర్లపల్లి గ్రామానికి చెందిన ఒకరిని, అన్నవరంకు చెందిన ఇద్దరిని, సంతగుడిపాడు గ్రామానికి చెందిన ఒకరిని ఈ రోజు రొంపిచర్ల మండల తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేయడం జరిగింది. సర్కిల్ పరిధిలోని అన్ని మద్యం దుకాణాలు యందు "ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్" ద్వారా మద్యం అమ్మకాలు జరిగేలా చూడడం జరుగుతుంది. ఈ రోజు విప్పర్ల రెడ్డిపాలెం లోని తిరుమల వైన్స్, ఆరెపల్లి ముప్పాళ్ల లోని సెవెనహిల్స్ వైన్స్ లను ఆకస్మికంగా తనిఖీ చేసి ఇన్స్పెక్షన్ చేయడం జరిగింది. ముందుగా డెకాయ్ ఆపరేషన్స్ చేసి మద్యం దుకాణాలు లో విక్రయిస్తున్న మద్యం ధరలను నిర్ధారించుకోవడం జరిగింది. ఈపూరు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజు సర్కిల్ పరిధి లో నాటు సారాయి, అక్రమ మద్యం, మాదక ద్రవ్యాలు మొదలగు నేరము ల గురించి ఎలాంటి సమాచారం వున్నా తెలుపవలసిందని, తెలిపిన వారి వివరాలు గొప్యం గా ఉంచడం జరుగుతుంది అని ఈ సందర్భంగా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజు ఇన్స్పెక్టర్ డి.వెంకటేశ్వర్లు తెలిపారు.

# రేపు మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం



**యడ్లపాడు, మేజర్ న్యూస్:** మండల కేంద్రమైన యడ్లపాడులోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అనగా రేపు ఉదయం 11 గంటలకు సర్వసభ్య సమావేశం జరుగుతుందని,అందరు ఎంపీటీసీ, జడ్పీటీసీ వారీ సభ్యులు,సర్పంచులు, గ్రామ, మండల నాయకులు పాల్గొనాలని ఎంపీడీవో హేమలతాదేవి ప్రకటనలో తెలిపారు.

# వృత్తిపర సమన్వయ సమావేశం నిర్వహించిన వెటర్నరీ కౌన్సిల్



**గుంటూరు, కలెక్టరేట్ మేజర్ న్యూస్:** ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ వెటర్నరీ కౌన్సిల్ చైర్మెన్ డా. పి. వి. లక్ష్మయ్య అధ్యక్షతన మంగళవారం వివిధ విభాగాలు, సంఘాల ప్రతినిధులతో వృత్తిపర సమన్వయ సమావేశం జరిగింది. పారా వెటర్నరీ అండ్ అలైడ్ కౌన్సిల్స్ చట్టం- 2023, వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా యాక్ట్- 1984 పై చర్చించారు. కౌన్సిల్ చైర్మన్ డా. పి. వి. లక్ష్మయ్య మాట్లాడుతూ అప్పటి ప్రిన్సిపాల్ సెక్రటరీ డా. మన్మోహన్ సింగ్ ఉద్దేశం ప్రత్యేక కౌన్సిల్ స్థాపన కాదని, విశ్వ విద్యాలయంపై భారాన్ని తగ్గించే విధంగా సిలబస్ తయారీ, కోర్సుల పర్యవేక్షణ, పరీక్షల నిర్వహణ కోసం సహాయక బోర్డ్ మాత్రమే అన్నారు. బోర్డు ఎపి స్టేట్ నెటర్నరీ కౌన్సిల్ పరిధిలోనే పనిచేయాలన్నారు. దాని కూర్పులో - పశుసంవర్ధక శాఖకు చెందిన అధికారులు, వైస్ చాన్సలర్, హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్స్ ఉండాలని తెలిపారు. ప్రభుత్వానికి సమగ్ర నివేదిక సమర్పించాలని సమావేశం నిర్ణయం తీసుకుంది. పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ డా. దామోదర్ నాయుడు మాట్లాడుతూ చట్టంలోని వివరాలను స్పష్టం చేశారు. వెటర్నరీ వైద్యులు, అధికారులు, పారా సిబ్బంది భావోద్వేగానికి లోనుకాకుండా, రాష్ట్రంలో వెటర్నరీ విద్య, సేవలు సజావుగా సాగేందుకు సర్వసమ్మత నిర్ణయం తీసుకోవాలని కోరారు. శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జె.వి.రామ్ మాట్లాడుతూ సిలబస్, పాఠ్య ప్రణాళిక, పరీక్షల విధానం వంటి విద్యా అంశాలపై నిర్ణయాలు తీసుకోవాలంటే, విశ్వవిద్యాలయ హెడ్స్ ఆఫ్ డిపార్ట్మెంట్స్ తప్పనిసరిగా బోర్డులో భాగస్వాములు కావాలని సూచించారు.

### పెటర్నరీ ప్రొఫెషనల్ సంఘాలు విజ్ఞాపన...

వెటర్నరీ డిగ్రీ పొందని ఎవరూ 'పెటర్నరీ' అనే పదాన్ని ఉపయోగించకూడదని సూచించాయి. "నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరీ అసోసియేషన్" వంటి పేర్లు, పారా వెటర్నరీ యాక్ట్ లో "వెటర్నరీ" పదం వాడటం వృత్తిపరమైన నిబంధనలకు విరుద్ధం అని స్పష్టం చేశాయి. తగిన అర్హతలు లేకుండా పశుసంవర్ధక శాఖలో చేరిన వ్యక్తులపై వెటర్నరీ కౌన్సిల్ కఠిన చర్యలు తీసుకోవాలని సంఘాలు కోరాయి.దఈ సమావేశంలో వెటర్నరీ కౌన్సిల్ రిజిస్ట్రార్ డా.ఎ.ఈశ్వరరావు, పారా వెటర్నరీ కౌన్సిల్ కార్యదర్శి డా. బేబీ రాణి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ సంఘం, పశుసంవర్ధక శాఖ అధికారుల సంఘం, వెటర్నరీ అసిస్టెంట్స్ సంఘం, పారా వెటర్నరీ ప్రతినిధులు, ఇతర సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి




తెనాలి, మేజర్ న్యూస్ : తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో మదర్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో మెప్మా సహకారంతో తెనాలి నియోజకవర్గంలోని మహిళలకు ఉచిత కుట్టు శిక్షణా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. రాష్ట్ర పౌర సరఫరా శాఖామాత్యులు నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో బొజ్జ సంధ్యారాణి మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ పై అవగాహన కల్పించారు. కార్యక్రమమునకు మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు, వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, ఎంపీడీవో అత్తోట దీప్తి, మెప్మా సిబ్బంది మెప్మా సిబ్బంది, డి ఆర్ డి ఏ సిబ్బంది సిబ్బంది, తెనాలి నియోజకవర్గం మహిళలు పాల్గొన్నారు. కార్యక్రమం ఉద్దేశించి సంధ్యారాణి మాట్లాడుతూ ప్రతి ఒక్క మహిళ స్వశక్తితో ఆర్థికంగా అభివృద్ధి చెందితే ఆ కుటుంబం బాగుంటుందన్నారు. ఈ ఉచిత టైలరింగ్ శిక్షణ 45 రోజులు రోజుకు రెండు గంటలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కమిషనర్ అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రస్తుత రోజులలో టైలరింగ్ యొక్క ఆవశ్యకత, తద్వారా కొంత ఆదాయమును పొందవచ్చునన్నారు. బ్యూటిషన్ ఆవశ్యకతను వివరించారు. పౌరసరఫరా శాఖామాత్యులు మనోహర్ సూచించిన విధంగా ఒకటవ తారీఖు నుండి ఈ ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమం ప్రారంభించడం జరుగుతుందన్నారు. తెనాలి మహిళలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



## లింగ వివక్ష లేని స్త్రీ సమాజం అభివృద్ధి చెందాలి

**తాడికొండ మేజర్ న్యూస్:** నేడు ప్రపంచంలో ప్రతి స్త్రీ లింగ వివక్ష ఎదుర్కొంటుందని, లింగ వివక్షలేని సమాజం రావాలని, అలాంటి సమాజంలో ప్రతి మహిళ అభివృద్ధి చెందాలని ఎంపీడీవో కే సమతా వాణి అన్నారు.మంగళవారం నాడు స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మార్పు కోసం ముందడుగు కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమం ఈనెల 25వ తారీకు నుండి డిసెంబర్ 23 వరకు నిర్వహిస్తారని ఈ కార్యక్రమంలో మహిళలు లింగ వివక్షత లేకుండా ఏ విధంగా చూడాలి,మహిళలపై దాడుల్లో ఏవిధంగా అరి కట్టాలి, చట్ట వ్యతిరేక పనులను మహిళలు ఏ విధంగా ఎదుర్కోవాలి వంటి వాటిపై నాలుగు వారాలు అవగాహన చేస్తారని ఆమె అన్నారు..ఈ సందర్భంగా తాసిల్దార్ టీ మెహర్ కుమార్ మాట్లాడుతూ మహిళలపై జరిగే దాడులు ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని, దాడులు చేసినవారిపై చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సిడిపిఓ ఎం అనురాధ, వెలుగు ఎపిఎం ఆర్ సాంబశివరావు, తాడికొండ అధికారులు పలువురు మహిళలు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు



**వినుకొండ మేజర్ న్యూస్:** వినుకొండ నియోజకవర్గం లోని వినుకొండ మండలం నడిగడ్డ గ్రామంలో రైతుల కోసం నిర్వహించినటువంటి "రైతన్న మీకోసం" అనే కార్యక్రమంలో నడిగడ్డ గ్రామానికి సంబంధించిన వి ఏ ఏ పురుషోత్తం రెడ్డి, ఎఫ్ ఎం టి హనుమంతరావు, శివలక్ష్మి,ఎఫ్ ఎస్ రాజారెడ్డి ఆధ్వర్యంలో గ్రామానికి సంబంధించిన రైతులు ట్రైనింగ్ ఐసిఆర్పి ఇందిరా ఈ కార్యక్రమంలో పాల్గొని రైతుల్ని ఉద్దేశించి రైతన్న మీకోసం కరపత్రాల పంపిణీ చేయటం జరిగినది ,దీనిని ఉద్దేశించి ట్రైనింగ్ ఐ సి ఆర్ పి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల ప్రకృతికే కాదు భూమికి కూడా నష్టం కలగకుండా ఉంటుందని రసాయనిక ఎరువులు , పురుగుమందులు వాడటం వల్ల భూమి పాడైపోవడమే కాకుండా దానిలో పండించిన పంటను తినటం వల్ల ప్రజలు కూడా అనారోగ్యాల పాలవుతారని తెలియజేశారు ప్రకృతిలో సహజ సిద్ధంగా దొరికే వాటితోనే కషాయాలు, సేంద్రియ ఎరువులు తయారు చేసుకుని వాడటం వల్ల భూమి ఆరోగ్యవంతంగా ఉండటమే కాకుండా ప్రజల ఆరోగ్యాలు కూడా మెరుగుపడతాయని ఇందిరా గారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో రైతులు, అగ్రికల్చర్ ఆఫీసర్స్ తదితరులు పాల్గొన్నారు.



## 30 మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ

**మంగళగిరి, మేజర్ న్యూస్:** మానవవనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆర్థిక సహకారంతో నిర్వహిస్తున్న స్త్రీశక్తి కార్యక్రమం ద్వారా దుగ్గిరాల మండలంలో కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న 30 మంది మహిళలకు మంగళవారం ఉచితంగా కుట్టుమిషన్లు, సర్టిఫికేట్స్ పంపిణీ చేశారు. 74వ బ్యాచ్‌లో 60 రోజుల పాటు శిక్షణ పొందిన మహిళలకు టీడీపీ కార్యాలయం ఎమ్మెస్సెస్ భవన్‌లో నియోజకవర్గ తెలుగు మహిళలు కుట్టుమిషన్లు అందజేశారు. లబ్ధిదారులు మంత్రి నారా లోకేష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే మంత్రి నారా లోకేష్ లక్ష్యమని అన్నారు. అందులో భాగంగానే మంత్రి నారా లోకేష్ నియోజకవర్గ వ్యాప్తంగా శిక్షణ ఇచ్చి కుట్టుమిషన్లు అందజేస్తున్నారని చెప్పారు. మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులేస్తేనే వారి కుటుంబంతో పాటు సమాజం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు, ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఆరుద్ర భూలక్ష్మి, దుగ్గిరాల ఎంపీపీ షేక్ జబీన్, దుగ్గిరాల మండల టీడీపీ అధ్యక్షురాలు కేసంనేని శ్రీ అనిత, రాష్ట్ర తెలుగు మహిళా కార్యదర్శి వింజమూరి ఆశాబాల, మంగళగిరి నియోజకవర్గ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మంచికలపూడి వైష్ణవి, దుగ్గిరాల మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు యార్లగడ్డ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# చలికాలం జాగ్రత్తలు పాటించాలి

**-యూపీహెచ్ సీ వైద్యాధికారిణి డాక్టర్ పి. అనూష**



**మంగళగిరి, మేజర్ న్యూస్:** చలికాలంలో ఆరోగ్య సమస్యలు దరి చేరకుండా, చలి నుండి శరీరాన్ని కాపాడుకుంటూ, ప్రజలు తగు జాగ్రత్తలు పాటిస్తూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఇందిరానగర్ యూపీహెచ్సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పీ అనూష అన్నారు. చలి కాలంలో వచ్చే ఆరోగ్య సమస్యలు, వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆమె వివరించారు. చల్లని చలికాలం ఆరోగ్యంపై చాలా ప్రభావాన్ని చూపుతోందన్నారు. శీతాకాలంలో దగ్గు, జలుబు, గొంతు నొప్పి, వైరల్ జ్వరాలు, ఆస్తమా, చర్మం పొడిబారి పోవడం వంటివి ఎక్కువగా వస్తాయన్నారు. చలికాలంలో తేమ శాతం బాగా తగ్గిపోవడంతో చర్మంలోని తేమ ఇగిరి పోయి, చర్మం పొడిబారి పోతుందన్నారు. పెదవులు, చెంపలు చిట్లిపోవడం, కాళ్లు, చేతులలో పగుళ్లు రావడం, దురద పెట్టడం వంటి సమస్యలు వస్తాయన్నారు. పొడి బారిన చర్మంకు మాయిశ్చరైజర్ క్రిములు, కొబ్బరి నూనె రాయాలన్నారు. ద్రాహం వేసిన, వేయకపోయిన నీరు ఎక్కువగా త్రాగాలన్నారు. గోరువెచ్చటి నీటితో స్నానం చేయాలన్నారు. చలికాలంలో రక్తనాళాలు, ధమనులు సంకోచించి బీపీ పెరిగి గుండెపోటుకు గురి అయ్యే ప్రమాదాలు ఉన్నాయన్నారు. చలికి కీళ్లు బిగిసిపోయి కదలికలు కష్టంగా చేస్తాయని, దాన్ని నివారించేందుకు కీళ్లను తరచూ కదలిస్తుండాలన్నారు. చలికాలం జీర్ణశక్తి మందగిస్తుందని కూరగాయలు, పండ్లు తీసుకుంటూ కొవ్వులు, పాల ఉత్పత్తులు, మాంసం, తక్కువగా తీసుకోవాలన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, శ్వాసకోశ వ్యాధులు, ఊపిరితిత్తులు, ఆస్తమా రోగులు మంచు పడే సమయంలో బయటికి వెళ్లకుండా ఉండాలన్నారు. పిల్లల చర్మం సున్నితంగా ఉండటం వల్ల చలి మరంతగా వేధిస్తుందని, శరీరాన్ని ఆలివ్ ఆయిల్, కొబ్బరి నూనెతో మసాజ్ చేయాలన్నారు. గోరువెచ్చటి నీటితో స్నానం చేయించి కొద్దిగా తడిగా ఉన్న శరీరంపై మాయిశ్చరైజర్ క్రీమ్ పెట్టాలన్నారు. తెల్లవారుజామున పొగ మంచు ఎక్కువగా ఉంటుందని సూర్యోదయం తర్వాత వాకింగ్, వ్యాయామం చేసుకోవాలన్నారు. చలి నుండి రక్షణ పొందటానికి ఉన్ని దుస్తులు, స్వెటర్లు, మాస్కులు, మఫ్లర్లు వాడాలన్నారు. శీతాకాలం సీజనల్ వ్యాధులతో బాధపడేవారు సమీపంలోని హెల్త్ సెంటర్లో ప్రభుత్వం అందించే ఉచిత వైద్య సేవలను పొందాలని డాక్టర్ అనూష విజ్ఞప్తి చేశారు.

# హక్కులతో పాటు బాధ్యతలు కూడా ముఖ్యం

- నేటి విద్యార్థులే రేపటి మా భవిష్యత్
- ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యత పెంచేందుకు కృషిచేస్తున్నాం
- మాక్ అసెంబ్లీకి ఎంపికైన మంగళగిరి విద్యార్థినిని అభినందించిన మంత్రి లోకేష్

**మంగళగిరి, మేజర్ న్యూస్:** అందరూ రాజ్యాంగం కల్పించిన హక్కుల గురించి మాట్లాడతారు. కానీ బాధ్యతల గురించి ఎవరూ మాట్లాడరు. హక్కులతో పాటు బాధ్యతలు కూడా ముఖ్యమని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. రేపటి స్టూడెంట్ మాక్ అసెంబ్లీకి ఎంపికైన మంగళగిరి విద్యార్థిని కూర్మాల శ్రీ కనకపుల్లమ్మను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఈ మేరకు ఉండవల్లి నివాసానికి సదరు విద్యార్థినితో పాటు కుటుంబ సభ్యులను పిలిపించుకుని మాట్లాడారు. మంగళగిరి బీఆర్ నగర్ లోని మున్సిపల్ హైస్కూల్ లో 8వ తరగతి చదువుతున్న శ్రీ కనకపుల్లమ్మ పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన, డిబేట్, క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి స్టూడెంట్ మాక్ అసెంబ్లీకి ఎంపికైంది.

### నేటి విద్యార్థులే రేపటి మా భవిష్యత్

ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. రాజ్యాంగ దినోత్సవం రోజున విద్యార్థులతో మాక్ అసెంబ్లీ నిర్వహణకు సీఎం గారితో మాట్లాడి నిర్ణయం తీసుకోవడం జరిగింది. నేటి విద్యార్థులే రేపటి మా భవిష్యత్. సీఎం చంద్రబాబునాయుడు గారు, ప్రధాని నరేంద్ర మోదీ గారు కూడా యువశక్తి గురించి మాట్లాడుతున్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు కృషిచేస్తున్నాం. అమ్మకు చెప్పకూడని పనులు చేయకూడదని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు గారు నిన్నటి విలువల విద్యాసదస్సు కార్యక్రమంలో చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తాం. విద్యార్థులు బాగా చదువుకుని ప్రయోజకులుగా మారాలి. తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలి. ప్రతి ఏడాది స్టూడెంట్ మాక్ అసెంబ్లీ నిర్వహిస్తాం. మిమ్మల్ని చూసి మరో పదిమంది విద్యార్థులు స్ఫూర్తి పొందుతారని మంత్రి అన్నారు. రేపటి మాక్ అసెంబ్లీలో మాకేమైనా సలహాలు, సూచనలు ఇస్తున్నారా అని మంత్రి సరదాగా వ్యాఖ్యానించారు. రేపటి కార్యక్రమానికి సీఎం గారు, స్పీకర్ గారు హాజరవుతున్నారని, జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. స్టూడెంట్ మాక్ అసెంబ్లీకి ఎంపికకావడం పట్ల చాలా ఆనందంగా ఉందని, ఆసక్తిగా ఎదురుచూస్తున్నామని విద్యార్థిని పేర్కొన్నారు. గతంలో కంటే ప్రభుత్వ పాఠశాలలో భోజనం బాగుందని తెలిపారు. మంత్రి స్పందిస్తూ.. విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా సెంట్రలైజ్ కిచెన్ ఏర్పాటుచేస్తామని చెప్పారు.

### మంగళగిరినా కుటుంబంలా మారిపోయింది

ఈ సందర్భంగా విద్యార్థిని కుటుంబ యోగక్షేమాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. మంగళగిరి 11వ వార్డులో నివాసం ఉండే విద్యార్థిని తండ్రి



రాము పుట్టుకతో దివ్యాంగుడు. ట్రై స్కూటీపై కూరగాయలు విక్రయిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. తన ఇద్దరు కుమార్తెలకు తల్లికి వందనం పథకం కింద ఆర్థిక సాయం అందిందని, తనకు రూ.6వేల పెన్షన్ వస్తోందని విద్యార్థిని తండ్రి రాము తెలిపారు. కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు. మంగళగిరి తన కుటుంబంలా మారిపోయిందని, మరింత బాధ్యత పెరిగిందని చెప్పారు. విద్యార్థిని శ్రీ కనకపుల్లమ్మ భవిష్యత్ లో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఈ సందర్భంగా మంత్రి ఆకాంక్షించారు. మంత్రి నారా లోకేష్ ను కలవడం పట్ల విద్యార్థిని కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

# జ్యూట్ వస్తువుల తయారీలో ఉచిత శిక్షణ

**గుంటూరు, కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** జ్యూట్ వస్తువుల తయారీలో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ డైరెక్టర్ టి.సందీప్ బాబు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జ్యూట్ వస్తువుల తయారీ, మగ్గం వర్క్ లకు డిసెంబరు 10వ తేదీ నుండి, సిసిటివి ఇన్స్టాలేషన్ కోర్స్ ల్లో డిసెంబరు 15వ తేదీ నుండి ఉచిత శిక్షణ ప్రారంభం అవుతుందన్నారు. ఈ శిక్షణ గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువత, మహిళలు, సిసిటివి ఇన్స్టలేషన్ కోర్సుకు అర్హులన్నారు. ఉచిత శిక్షణలో ఉచిత భోజన సదుపాయము, ఉచిత హాస్టల్ వసతి కల్పించడం జరుగుతుందని చెప్పారు. 19 నుండి 50 సంవత్సరాల వయసు కలిగి, ఆసక్తి కలిగిన వారు తమ వివరాలను యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలో నమోదు చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు తెల్ల రేషన్ కార్డు కాపీ, ఆధారకార్డు కాపీ, నాలుగు పాస్పోర్టుసైజు ఫోటోలు, 10వ తరగతి సర్టిఫికెట్ జత పరచాలని అన్నారు. దరఖాస్తులను గుంటూరు కొత్తపేట ఓల్డ్ బ్యాంక్ స్ట్రీట్ 14-1-14 యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ చిరునామాకు సమర్పించాలని కోరారు. వివరాలకు 08632336912, 9700687696, 8125397953, 9949930155, 9703405066 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని కోరారు.



## యువజనోత్సవాల్లో విజ్ఞాన్
# డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

**గుంటూరు రూరల్ మేజర్ న్యూస్:** స్థానిక బ్రాడీపేట బండ్లమూడి హనుమాయమ్మ మహిళా డిగ్రీ కళాశాల నందు 22 న యువజన సంక్షేమ శాఖ అయిన స్టెప్ స్వశక్తి వారు జిల్లా స్థాయి యువజనోత్సవాలు నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా స్థానిక పలకలూరులో గల విజ్ఞాన్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులు చిత్రలేఖనంలో ప్రథమ స్థానం, విజ్ఞానము మరియు సాంకేతికత ప్రాజెక్టుల్లో రెండవ స్థానం పొందారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి .అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. చిత్రలేఖనంలో ప్రథమ స్థానం పొందిన డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న సి. హెచ్ యశ్వంత్ తదుపరి రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని అనురాధ తెలియజేశారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ శ్రీకృష్ణదేవరాయలు మరియు సీఈవో డాక్టర్ మేఘన, విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

## రిజర్వ్ ఇన్స్పెక్టర్ సతీష్ కుమార్ అనుమానాస్పద మృతిపై
# విచారణ వేగవంతం చేయాలి

- బాధితులను శిక్షించి కుటుంబానికి ప్రభుత్వం వెంటనే న్యాయం చేయాలి
- రాష్ట్ర ప్రభుత్వానికి బీసీ సంఘాల వినతి



**గుంటూరు, విద్య మేజర్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ బీసీ పెన్షనర్స్ ఉద్యోగ ఉపాధ్యాయ జేఏసీ చైర్మన్ మదాసు రంగనాయకులు, ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘాలు స్థానిక ఎస్సీ ఎస్టీ కమ్యూనిటీ హాల్ నందు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో యునైటెడ్ బీసీ ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షులు పావులూరు హనుమంతరావు మాట్లాడుతూ ఇటీవల తిరుమల తిరుపతి దేవస్థానం పారకామని కేసులో ముఖ్య సాక్షి దర్యాప్తు అధికారి రిజర్వ్ ఇన్స్పెక్టర్ వై సతీష్ కుమార్ అనుమానాస్పద మరణం పై బీసీ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయని ఒక నిజాయితీ గల ఆఫీసర్ గా అవినీతిని అంతం చేసేందుకు కృషి చేస్తున్న నేపథ్యంలో ఇటువంటి దారుణానికి పాల్పడటం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఇటీవల కాలంలో రాష్ట్రం వ్యాప్తంగా బీసీలపై అనేక దాడులు జరుగుతున్నా కూడా ప్రభుత్వం స్పందించకపోవడం చాలా బాధాకరమని విచారణ వ్యక్తం చేశారు. ఒక కుమ్మరి కులానికి చెందిన నిజాయితీ గల అధికారి సతీష్ కుమార్ అనుమానాస్పద మృతిపై ప్రభుత్వం వెంటనే విచారణ వేగవంతం చేసి వారి కుటుంబానికి న్యాయం చేయాలని కుటుంబానికి ఆర్థికంగా రెండు కోట్ల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించడమే కాకుండా కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు కుటుంబానికి ప్రత్యేక రక్షణ కల్పించాలని పావులూరి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. యునైటెడ్ బిసి ఫ్రంట్ ప్రధాన కార్యదర్శి లలిత్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా బీసీలపై అనేక దాడులు జరుగుతున్నాయని ముఖ్యంగా కుమ్మర సామాజిక వర్గానికి చెందిన ఒక నిజాయితీ గల అధికారి ప్రత్యేకమైన కేసు విచారణలో ఉండగా ఇటువంటి దారుణం జరగటం బాధాకరమని అన్నారు. ఎన్నికల సమయంలో అన్ని రాజకీయ పార్టీలు కూడా బీసీలకు రక్షణ కల్పిస్తామని బీసీల రక్షణకు ప్రత్యేక చట్టాన్ని తీసుకొస్తామని హామీలు ఇవ్వడం తప్ప అమలులో నోచుకోలేని పరిస్థితుల్లో ప్రభుత్వాన్ని ముందుకు సాగుతున్న నేపథ్యంలో బీసీలకు రక్షణ కరువైందని ఇప్పటికైనా ప్రభుత్వాలు కళ్ళుతెరిచి బీసీ రక్షణ కొరకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. దీనిపై త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని బీసీ సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నట్లు వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షులు చిరతనగండ్ల వాసు, వికేసీ పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షులు జయసుధ, ఎంప్లాయిస్ జె.ఏ.సి సెక్రటరీ వెంకటేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఆధారం

**గుంటూరు రూరల్, మేజర్ న్యూస్:** పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఆధారమని విజ్ఞాన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అనురాధ అన్నారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ విజ్ఞాన డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో పెదపలకలూరు గ్రామంలో మంగళవారం మొక్కల నాటే కార్యక్రమం జరిగింది.



శిబిర కార్యకలాపాలను నోడల్ అధికారి రవికుమార్ రెడ్డి, సానిటరీ ఇన్స్పెక్టర్ బి దుర్గారావు, పి పూర్ణచంద్రరావు, ఎన్ ఎస్.ఎస్ వాలంటీర్స్, విజ్ఞాన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అనురాధ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి అంకప నాయుడు, గ్రామ ప్రజలు శిబిరంలో నిర్వహిస్తున్న సామా జిక సేవా కార్యక్రమాలు, అవగాహనా కార్యక్రమాలు, శుభ్రత కార్యక్రమాలు, అలాగే విద్యార్థుల చురుకైన పాల్గొనడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల ద్వారా సమాజ అభివృద్ధికి సేవ చేయాలనే భావనను పెంపొందించుకోవాలని ప్రోత్సహించారు. సమాజ సేవ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, మనోబలం పెంపొందించడంలో ఎంతో కీలకమని వివరించారు.

# మంగళగిరిలో జాబ్ మేళా నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి

**దుగ్గిరాల, మేజర్ న్యూస్:** మంగళగిరి నియోజకవర్గ శాసనసభ్యులు ,రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో నిరుద్యోగ యువకుల కోసం ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 29న మంగళగిరిలో జాబ్ మేళా నిర్వహించబడుతుందని మండల నాయకులు తెలిపారు . వి టి జే ఎం అండ్ ఐ వి టి ఆర్ డిగ్రీ కళాశాలలో జరిగే జాబ్ మేళా లో నిరుద్యోగ యువకులు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు .విద్యార్హత ఆధారంగా పదివేల రూపాయల నుండి 30 వేల వరకు వేతనాలు ఉండవచ్చునని పది ,ఇంటర్ ఐటిఐ ,డిగ్రీ ,బీటెక్, డిప్లమో ,ఫార్మసీ ,పీజీ చదువుతున్న 18 నుంచి 25 సంవత్సరాల వయసు గల నిరుద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

# బీసీ వై పార్టీ అధ్యక్షులు బోడే రామచంద్రరావు యాదవ్ పర్యటన అడ్డుకుంటాం

**– యాదవుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది**
**– యాదవ సంఘం నేతలు**



**మంగళగిరి మేజర్ న్యూస్ :** బీసీవై పార్టీ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ ఈనెల 26వ తేదీన బుధవారం నిర్వహించతలపెట్టిన మంగళగిరి పర్యటన అడ్డుకుంటామని యాదవ సంఘ నేతలు తెలిపారు. సోమవారం ద్వారకానగర్ లో జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. కృష్ణుడి గుడి వివాదం పేరుతో మంగళగిరిలో పర్యటించి అనవసర రాద్ధాంతం చేయవద్దని హితవు పలికారు. రాష్ట్ర మంత్రి స్థానిక ఎమ్మెల్యే నారా లోకేష్ యాదవ సామాజిక వర్గ ప్రయోజనాలకు, సంక్షేమానికి కట్టుబడి ఉన్నారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో కృష్ణుడి గుడిని ఎవరూ కూల్చలేదని తెలిపారు. లేనిపోని వివాదం చేయాలని తద్వారా రాజకీయ లబ్ధికి ప్రయత్నించవద్దని హితవు పలికారు. అలా కాకుండా మంగళగిరిలో కృష్ణుడి గుడి అంశాన్ని వివాదం చేసేందుకు బీసీ వై పార్టీ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ వస్తే పర్యటనను అడ్డుకుంటామని స్పష్టం చేశారు. మంగళగిరిలో యాదవ సామాజిక వర్గం మొత్తం ఒకే తాటిపై ఉన్నారని అన్నారు. గత వైసిపి ప్రభుత్వం యాదవులను మభ్య పెట్టేందుకు కృష్ణుడి గుడి కోసం అంటూ స్థలాన్ని కేటాయిస్తున్నామని అసత్య ప్రచారం చేశారని తెలిపారు. స్థానికంగా ఉన్న ఈ తరహా పరిస్థితులు మీకు తెలియదని, ఈ క్రమంలో మంగళగిరి పర్యటనను విరమించుకోవాలని హితవు పలికారు. కావాలని కొందరు దురుద్దేశంతో ఈ అంశాన్ని రాజకీయం చేయాలని తద్వారా లబ్ధి పొందాలని, స్వ ప్రయోజనాల కోసం యోచిస్తున్నారని విమర్శించారు. ఈ ప్రాంతంలో కృష్ణుడి గుడి నిర్మాణం జరగకుండానే ఎలా కూల్చివేస్తారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంపై బురదజల్లేందుకే రామచంద్ర యాదవ్ నీచ రాజకీయాలకు తెర లేపారన్నారు. అభివృద్ధి చేసే ప్రభుత్వం కూటమిదైతే%ౌ%కట్టడాలను కూల్చే ప్రభుత్వం వైసీపీదేనని విమర్శించారు.ప్రభుత్వం యాదవుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ఎలాంటి తప్పుడు ప్రచారాలు తమ ధార్మిక విశ్వాసాలను లేదా అభివృద్ధి కార్యక్రమాలను దెబ్బతీయలేవని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో యాదవ సంఘం నాయకురాలు ఆరుద్ర భూలక్ష్మి, చావలి ఉల్లయ్య యాదవ్, తులిమిల్లి రామకృష్ణ యాదవ్, తోట పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

# వీవర్స్ కాలనీ స్థలాలకు విముక్తి

**– 22 A జాబితా నుంచి తొలగింపులో మంత్రి నారా లోకేష్ కీలక భూమిక**
**– మంత్రి నారా లోకేష్ కు ధన్యవాదాలు తెలిపిన వీవర్స్ కాలనీవాసులు**



**మంగళగిరి మేజర్ న్యూస్ :** నగరంలోని వీవర్స్ కాలనీ స్థలాలను 22 A జాబితా నుండి తొలగించేలా రాష్ట్ర మంత్రి నారా లోకేష్ తీసుకున్న చొరవ కాలనీవాసుల్లో హర్షాన్ని నెలకొల్పింది. సంవత్సరాల క్రితమే కేటాయించిన భూస్థలాలు 22 A జాబితాలో చేరడంతో నిర్మాణాలు చేపట్టలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వీవర్స్ కాలనీ కుటుంబాలకు ఈ నిర్ణయం పెద్ద ఉపశమనం కలిగించినట్లు నివాసితులు వెల్లడించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ, ప్రజా సమస్యలను అతి తక్కువ సమయంలో పరిష్కరించే నాయకుడిగా లోకేష్ మరొకసారి నిరూపించుకున్నారని స్థానికులు ప్రశంసించారు. వీవర్స్ కాలనీ సమస్యను అనేక సందర్భాల్లో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించని పరిస్థితుల్లో, మంత్రి లోకేష్ ప్రత్యక్షంగా వ్యవహరించి సమస్యను తీర్చడం పట్ల నివాసితులు ఆనందం వ్యక్తం చేశారు. వీవర్స్ కాలనీ నివాసితులు మాట్లాడుతూ... ఇంతకాలంగా ఎవరూ చేయలేకపోయిన పని మంత్రి నారా లోకేష్ చేసి చూపారు. మా స్థలాలపై ఉన్న అడ్డంకులు తొలగిపోవడంతో ఇళ్ల నిర్మాణం, అభివృద్ధి పనులకు మార్గం సుగమమైంది. మంగళగిరి ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయే నాయకుడు నారా లోకేష్" అని పేర్కొన్నారు.. స్థలాల 22 A నుండి తొలగింపుతో వీవర్స్ కాలనీ అభివృద్ధికి కొత్త దారులు తెరచుకున్నాయని, భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయబడతాయన్న నమ్మకం వ్యక్తం చేశారు.

# రైతుల సంక్షేమానికి "రైతన్న మీకోసం"

**– ఎమ్మెల్యే బూర్ల**



**గుంటూరు రూరల్ మేజర్ న్యూస్ :** రాష్ట్రంలోని రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం రైతన్న మీకోసం అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు తెలిపారు. గుంటూరు రూరల్ మండలం పెదపలకలూరు గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం "రైతన్న మీకొసం" కార్యక్రమం జరిగింది. ప్రత్తిపాడు శాసనసభ్యులు బూర్ల రామాంజనేయులు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు చేపట్టిన "రైతన్న మీకొసం" కార్యక్రమం రైతు సంక్షేమానికి విప్లవాత్మక కార్యక్రమం అని పేర్కొన్నారు. రైతులే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభాలని, వ్యవసాయం, ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్య రంగాలు కలిపి రాష్ట్ర జీ.ఎస్.డీ.పీలో 35% వాటా అందిస్తూ ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపిస్తున్నాయని అన్నారు. స్వర్ణ ఆంధ్ర 2047 లక్ష్యాల ప్రకారం కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తోంది అన్నారు. 2047 నాటికి రూ.308 కోట్లు, ఆర్థిక వ్యవస్థగా మార్చాలని,ప్రజల తలసరి ఆదాయాన్ని రూ.55 లక్షలు వరకు పెంచే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా వ్యవసాయం మరియు అనుబంధ రంగాల్లో ఏటా 15% వృద్ధి రేటు సాధించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నదన్నారు. రానున్న నాలుగేళ్లలో "రైతే రాజు" అన్న నినాదాన్ని నిజం చేసేందుకు ప్రభుత్వం ఈ క్రింది విధానాలను అమలు చేస్తున్నది: నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటల ప్రోత్సాహం, అగ్రిటెక్ వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్ రంగ విస్తరణ, ప్రభుత్వం నుండి పాడి మరియు రైతులకు సమగ్ర మద్దతు తదితర అంశాలపై దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. అలాగే పెట్టుబడి సాయం కార్యక్రమం కింద గుంటూరు రూరల్ మండలంలోని దాదాపు 4,986 మంది రైతులకు రూ.6.85 కోట్లు పీఎం-కిసాన్ / అన్నదాత సుఖీభవ పథకాల ద్వారా రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేసినట్లు వివరించారు. పెదపలకలూరు గ్రామంలో ఇప్పటివరకు చేపట్టిన సుమారు రూ.6 కోట్ల విలువైన అభివృద్ధి పనులు గురించి కూడా గ్రామ ప్రజలకు తెలియజేశారు. అలాగే రైతులు పంటలను మార్కెట్‌కు తీసుకువచ్చే సమయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భాగంగా శనగ విత్తనాలను రాయితీ పై రైతులకు పంపిణీ చేశారు. కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు ఎన్. మోహన్ రావు, మండల వ్యవసాయ అధికారి బుల్లా కిషోర్, వ్యవసాయ అధికారి ఏ. అమూల్య గారు, మండల ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, రైతు సోదరులు పాల్గొన్నారు.

# మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ



**దుగ్గిరాల మేజర్ న్యూస్ :** మంగళగిరి నియోజకవర్గ శాసనసభ్యులు, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రివర్యులు నారా లోకేష్ సహకారంతో స్త్రీ శక్తి కార్యక్రమం ద్వారా దుగ్గిరాల మండలంలో కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న 30 మంది మహిళలకు కుట్టు మిషన్లను, సర్టిఫికెట్స్ ను పంపిణీ చేశారు. 74వ బ్యాచ్ లో 60 రోజులు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ తెలుగు మహిళలు పాల్గొని మహిళలకు కుట్టు మిషన్ లను.పంపిణీ చేశారు. ఏపీ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఆరుద్ర భూలక్ష్మి, దుగ్గిరాల మండల ఎంపిపి షేక్ జబీన్,మండల టిడిపి అధ్యక్షురాలు కేసం నేని శ్రీ అనిత, మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు యార్లగడ్డ లక్ష్మి, రాష్ట్ర తెలుగు మహిళ కార్యదర్శి వింజమూరి ఆశా బాల, ఎం.వైష్ణవి తదితరులు పాల్గొని శిక్షణ పూర్తి చేసుకున్న 30 మంది మహిళలకు కుట్టు మిషన్లను అందజేశారు.



# నందివెలుగులో రైతన్న మీకోసం



**తెనాలి మేజర్ న్యూస్ :** మండలంలోని నందివెలుగు గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం అధికారులు పర్యటించారు. మండల స్పెషల్ ఆఫీసర్, సివిల్ సప్లైస్ డీఎం తులసి, తెనాలి మండల పరిషత్ అభివృద్ధి అధికారి టి. దీప్తి, మండల వ్యవసాయాధికారి కె. సుధీర్ బాబ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల స్పెషల్ ఆఫీసర్ తులసి మాట్లాడుతూ రాబోయే ఐదేళ్లలో రైతులను రాజులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రూపొందించిన ఐదు విధానాలను రైతు వద్దకు తీసుకువెళుతున్నామని చెప్పారు. మండల వ్యవసాయ అధికారి సుధీర్ బాబు మాట్లాడుతూ వారం రోజులు వ్యవసాయ, అనుబంధ శాఖల సిబ్బంది మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రతి రైతును ప్రత్యక్షంగా కలిసి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. నీటి భద్రత, డిజిటల్ వ్యవసాయం, ఆధునిక సాంకేతికత, సమగ్ర మార్కెటింగ్, పంటల లాభదాయకతపై రైతులకు వివరించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఈవో మురళి, విఏఏ లావణ్య, జి.నరసింహరావు, జి. నాగ దుర్గా ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

# ఆసక్తిగా వింటున్న చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలు

**దుగ్గిరాల మేజర్ న్యూస్ :** జన్మనిచ్చిన తల్లికి చెప్పలేని పని చేయడమేనని జీవితంలో అన్నిటికన్నా పెద్ద తప్పు,పెద్ద నేరమంటూ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. ఏపీ విద్యాశాఖ ఏర్పాటు చేసిన సదస్సులో మాట్లాడుతూ ఏ పని చేసిన జన్మనిచ్చిన తల్లికి. చెప్పగల గా లనీ అన్నారు. భగవంతుడు ఎంతో, అమ్మ కూడా అంతేనని. చెప్పే చాగంటి ప్రవచనాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. మహాత్ములైన మహానుభావుల జీవితాన్ని పరిశీలిస్తే అమ్మకు నమస్కారం చేయకుండా లేరంటూ చాగంటి వివరించారు. మాజీ ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం తన జీవిత చరిత్రలో తన అమ్మ గొప్పతనాన్ని గురించి రాశారంటు చాగంటి. కోటేశ్వరరావు చెప్పిన విషయాలను ప్రజలు ఎంతో ఆసక్తిగా వినడం ఎంతో విశేషం.

# నేడే శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో శ్రీ బాల సుబ్రహ్మణ్య స్వామి షష్టి వేడుకలు

**దుగ్గిరాల మేజర్ న్యూస్ :** దుగ్గిరాల గ్రామంలోని శ్రీ మణికంఠ అయ్యప్పస్వామి ఆలయంలో నేడే శ్రీ సుబ్రహ్మణ్య స్వామి షష్టి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. శ్రీ బాల సుబ్రహ్మణ్య స్వామి షష్టి వేడుకల సందర్భంగా అయ్యప్ప స్వాములు, భవాని స్వాములు, ఆంజనేయులు, మాలాదారులు, శివమాల దారులు అందరూ పాల బిందెలు, పాల కావిడిలతో అంగరంగ వైభవంగా పాల్గొనాలని శ్రీ మణికంఠ అయ్యప్ప స్వామి సేవా సమాజం తెలిపారు. దుగ్గిరాలలోని రైలుపేట లో గల శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి గుడి దగ్గర నుంచి బయలుదేరి శ్రీ మణికంఠ అయ్యప్పస్వామి దేవాలయం చేరుకుని హోమ గుండంలో నడిచి 18 మెట్ల మీద గా వెళ్లి ముగ్గురు స్వాములకు పాలాభిషేకం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు అందరూ పాల్గొని సుబ్రమణ్య స్వామి షష్టి వేడుకలను జయప్రదం చేయాలని కోరారు.

# సద్ది లో పాల్గొన్న అయ్యప్ప స్వాములు



**దుగ్గిరాల మేజర్ న్యూస్ :** దుగ్గిరాల గ్రామంలోని శ్రీ మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రతినిత్యం జరిగే సద్ది కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు పాల్గొని సద్దిని స్వీకరించారు. ఆలయంలో గత నెల 24 నుండి ప్రారంభమైన అన్నదాన కార్యక్రమంలో భాగంగా అయ్యప్ప స్వాములు, భవాని స్వాములు, ఆంజనేయ మాలాదారులు శివమాల దారులు, భక్తులు సద్ది కార్యక్రమంలో పాల్గొంటున్నారు. గత నెల రోజులు పైబడి స్వాములకు శ్రీ మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో సద్ది కార్యక్రమాన్ని ఆలయ సేవ సమాజం ఏర్పాటు చేయటం ఎంతో అభినందించదగ్గ విషయం.

# ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యల పట్ల యు టి ఎఫ్ నిబద్ధతతో పనిచేస్తుంది




**దుగ్గిరాల మేజర్ న్యూస్ :** దుగ్గిరాల గ్రామంలోని జిల్లా పరిషత్తు బాలుర పాఠశాలలో మండల యుటిఎఫ్ మహాసభ సమావేశం జరిగింది. సభలో యుటిఎఫ్ మండల అధ్యక్షులుగా కే.కామాక్షి, ప్రధాన కార్యదర్శిగా వి.చలపతిరావు, గౌరవ అధ్యక్షులుగా పి.శ్రీనివాసరావు, సహాధ్యక్షులుగా జి.విజయలక్ష్మి, ఆర్.వి.ప్రసాద్, ఆర్థిక కార్యదర్శిగా షేక్.ఎండి.హుస్సేన్, 9 మంది కార్యదర్శిలను, 7 జిల్లా కౌన్సిలర్లను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పట్ల ఉపాధ్యాయుల సమస్యలపై యుటిఎఫ్ శాఖ నిబద్ధతతో పనిచేస్తుందన్నారు. గత సంవత్సర కాలంలో సంఘం చేపట్టిన కార్యక్రమాలు, ఆర్థిక కార్యక్రమాల గురించి వివరించారు. సమావేశంలో జిల్లా ఉత్తమ అవార్డు గ్రహీతలు ఎండి కరిముల్లా, ఎస్.కోటేశ్వరమ్మ లను ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ టిఎస్ఎల్ఎన్. మల్లేశ్వర రావు, సీనియర్ నాయకులు అహ్మద్ హుస్సేన్, సాంబశివరావు, సభ్యులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీహెచ్ఎస్ బాలికోన్నత పాఠశాలలో 4 యూనిట్స్ శానిటేషన్ బ్లాక్ నిర్మాణానికి ఏర్పాట్లు



దుగ్గిరాల ,మేజర్ న్యూస్:దుగ్గిరాల గ్రామంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో బాలికలకు శానిటేషన్ బ్లాక్ లను నిర్మించేందుకు నెస్ స్టీల్ ఇండియా కంపెనీ ముందుకు వచ్చినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్. శోభా దేవి తెలిపారు. బాలికలకు నాలుగు యూనిట్స్ శానిటేషన్ బ్లాక్ లను నిర్మించేందుకు పాఠశాలను సందర్శించారని అన్నారు. నెస్ స్టీల్ ఇండియా సహకారంతో త్వరలో బాలికలకు శానిటేషన్ బ్లాక్ లను నిర్మించేందుకు ఏర్పాట్లు చేపట్టినట్లు హెచ్ ఎం ఎస్ శోభా దేవి తెలిపారు. బాలికలకు శానిటేషన్ బ్లాక్ ను లను నిర్మించేందుకు ముందుకొచ్చిన నెస్ స్టీల్ ఇండియా ను పాఠశాల ఉపాధ్యాయుల బృందం ,బాలికలు అభినందనలు తెలిపారు.

## అట్టహాసంగా జరిగిన రైతన్న నీ కోసం...



**యడ్లపాడు,మేజర్ న్యూస్:** స్వర్ణాంధ 2047 లక్ష్యంలో భాగంగారాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ, అనుబంధ రంగాల్లో సగటున 15 శాతం వృద్ధిరేటు సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం “రైతన్నా మీకోసం” కార్యక్రమాన్ని ప్రారంభించిందని చిలకలూరిపేట నియోజకవర్గ సమన్వయ కర్త నెల్లూరి సదాశివరావు పేర్కొన్నారు. మండలంలోని కొండవీడు లో మండల పార్టీ అధ్యక్షుడు కామినేని సాయిబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం లో ముఖ్య అతిథి గా హాజరైన ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్నందునే సకాలంలో రైతుల ఉత్పత్తుల కొనుగోళ్లు, మద్దతు ధరల అమలు సాధ్యమైందని, నూతన సాగు విధానాలతో రాష్ట్ర వ్యవసాయరంగాన్ని దేశానికే ఆదర్శంగా నిలపాలన్న గట్టి పట్టుదలతో సీఎం ఉన్నారని అన్నారు. రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని ప్రారంభించి గ్రామంలోని రైతుల ఇళ్లకు వెళ్లి ముఖ్యమంత్రి రైతాంగానికి రాసిన లేఖతో పాటు, ప్రభుత్వం అమలుచేయాలనుకుంటున్న నూతన సాగువిధానాలు.. అందించే సబ్సిడీలు, ప్రోత్సాహకాలను వారికి తెలియచేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ షేక్ టిడిపి కరీముల్లా, మండల పార్టీ అధ్యక్షులు కామినేని సాయిబాబు, తెలుగు రైతు జిల్లా అధ్యక్షులు మద్దూరి వీరారెడ్డి, జిల్లా కార్యదర్శి పోపూరి వెంకయ్య, నీటి సంఘం అధ్యక్షులు పోపూరి రాఘవయ్య, మండల తెలుగు రైతు అధ్యక్షులు కనపర్తిలక్ష్మీప్రసాద్, మండల జనసేన పార్టీ అధ్యక్షులు పి హనుమంతరావు, జనసేన పార్టీ నాయకులు తోట నాని, ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె అమల కుమారి, మండల హార్టీకల్చర్ అధికారి ఆర్ శ్రీలక్ష్మి, గ్రామ హార్టీకల్చర్ అసిస్టెంట్ పి కృష్ణ సౌజన్య, 60వ నెంబర్ బూత్ కన్వీనర్ కాశీ రామారావు, కొండవీడు పార్టీ నాయకులు షేక్ షఫీ, గంట వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## యుటీఎఫ్ తెనాలి కార్యవర్గం ఎన్నిక




**తెనాలి, మేజర్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటీఎఫ్) తెనాలి శాఖ ఎన్నిక మంగళవారం నిర్వహించారు. స్థానిక యుటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో తెనాలి పట్టణ శాఖ అధ్యక్షులుగా పి సౌజన్య, ప్రధాన కార్యదర్శిగా ఎస్ కె కరీముల్లా ఎన్నికయ్యారు. యుటిఎఫ్ అభివృద్ధికి కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన కార్యవర్గం స్పష్టం చేశారు. సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి కళాధర్, నాయకులు ఆదినారాయణ, దౌల, కోటి సుందరరావు, చక్రవర్తి, సాంబశివరావు, కరీముల్లా, అహమ్మద్ హుస్సేన్, కె ఎస్ ప్రసాద్ పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అధికారులు సమన్వయంతో ట్రాఫిక్ నియంత్రించాలి- సబ్ కలెక్టర్ సంజనా సింహ



**తెనాలి మేజర్ న్యూస్ :** స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ట్రాఫిక్ అడ్వైజర్ కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. మున్సిపాలిటీ, రోడ్లు భవనాల శాఖ, పోలీస్, ఇరిగేషన్, ఆర్టీసీ శాఖలతోపాటు ఆటో యూనియన్, లారీ యూనియన్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు. పట్టణంలో ప్రస్తుతం ఉన్న ట్రాఫిక్ సమస్యను పలువురు సబ్ కలెక్టర్ సంజనా సింహ దృష్టికి తీసుకువచ్చారు. ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించి పోలీస్ వివిధ శాఖలతో ఆమె సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్యల గురించి ప్రజల నుండి ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని ఆమె కోరారు. హొటల్స్, మాల్స్, దుకాణదారులు పార్కింగ్ సమస్యలు రాకుండా చూసుకోవాలని అన్నారు. ట్రాఫిక్ నియంత్రణ కు సంబంధించి పోలీసు వారితో చర్చించడం జరిగిందని మైనర్ డ్రైవింగ్, ఓవర్ లోడింగ్, డ్రంక్ డ్రైవ్ వాటిపై తీసుకుంటున్న చర్యలపై ఆరా తీస్తున్నట్టు ఆమె చెప్పారు. పట్టణ, శివారు ప్రాంతంలో అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు వేయాలని ఇప్పటికే రోడ్లు భవనాల శాఖ సిబ్బందికి సూచించినట్లు చెప్పారు. పట్టణంలో వంతేనలు ఎక్కువగా ఉన్నందున పంట కాలువలకు ఇరుప్రక్కల రెయిలింగ్ ఏర్పాటు విషయంపై నీటి పారుదల శాఖ అధికారులకు సూచించినట్లు తెలిపారు. పట్నంలో బిర్యాని పాయింట్లు నడిపేవారు దుకాణాల ముందు ఆక్రమణలు చేసి ట్రాఫిక్ కు ఇబ్బంది కలిగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇప్పటికే త్రీ టౌన్ పోలీసు వారు ఆక్రమణలపై దృష్టి సాధించినట్లు అందుకు వారిని అభినందిస్తున్నట్లు చెప్పారు. పోలీస్ సిబ్బంది మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో ఆక్రమణలపై దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని ఆమె కోరారు. ప్రణాళిక బద్ధంగా ట్రాఫిక్ సమస్యను పరిష్కరించనున్నట్లు ఆమె చెప్పారు. డిసెంబర్ నెల పదో తేదీన ట్రాఫిక్ సమస్యపై మరో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు, ఆ సమావేశం నాటికి చాలావరకు ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించనున్నట్లు ఆమె చెప్పారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, లారీ ఆటో వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కుంగ్ ఫు జాతీయస్థాయి టోర్నమెంట్లో బంగారు పతకాలు కైవసం...



**యడ్లపాడు(చిలకలూరిపేట), మేజర్ న్యూస్:** ఈనెల 23వ తేదీన ఒంగోలు పట్టణంలో జరిగిన బోధిధర్మా కరాటే ఇనిస్ట్యూట్ వారు నిర్వహించిన జాతీయస్థాయి కుంగ్ ఫు అండ్ కరాటే టోర్నమెంట్లో చిలకలూరిపేట పట్టణానికి చెందిన న్యూ షావులేని కుంగ్ ఫు అకాడమీ విద్యార్థులు కటా విభాగంలో బంగారు పతకాలు సాధించి అబ్బురపరిచారు సబ్ జూనియర్, జూనియర్ విభాగాలలో వారి యొక్క ప్రతిభను కనపరిచి బంగారు పతకాలని కైవసం చేసుకున్నారు వారికి సి ఆర్ క్లబ్ లో అకాడమీ మాస్టర్లు మరియు క్లబ్ పెద్దల చేత అభినందన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో హనుమంతరావు, కాళిదాసు,విద్యార్థులని మెడల్స్ తో సత్కరించి వారికి అభినందనలు తెలియజేశారు సబ్ జూనియర్ విభాగాల్లో కటావిభాగంలో వైభవ్,శశాంక్,షణ్ముఖులు అద్భుత ప్రదర్శన ఇచ్చి అలాగే జూనియర్ విభాగాల్లో సమీర్,అష్రాఫ్, అఖిల్ పాల్గొని తమ సత్తాని చాటారు వారికి శిక్షణ ఇచ్చిన మాస్టర్లను ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు అకాడమీ మాస్టర్ బత్తుల విక్రమ్ మాట్లాడుతూ చిలకలూరిపేట పట్టణంలో గత పది సంవత్సరాలుగా స్థానిక సీఆర్ క్లబ్ లో ఎంతోమంది విద్యార్థులకు ఉచితంగా ఉదయం 6 గంటల నుండి 7 గంటల వరకు మార్షల్ ఆర్ట్స్ లో శిక్షణ ఇస్తున్నామని మరి ప్రతి ఒక్కరు కూడా ఈ అవకాశాన్ని తెలుసుకొని తప్పనిసరిగా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ముఖ్యంగా ఆడపిల్లలకి ఈ సమాజంలో వారిపై జరుగుతున్నటువంటి దాడులను ప్రతిఘటించేందుకు వారికి మానసిక దృఢత్వానికి ఆత్మస్థైర్యానికి అదేవిధంగా ఫిట్నెస్ గా ఉండేటందుకు తోడ్పడుతుందని సెల్ఫ్ డిఫెన్స్ లో ప్రత్యేకమైన శిక్షణను సీనియర్ మాస్టర్ అకాడమీ చీఫ్ దర్యావలి నేర్పిస్తున్నారని తెలియజేశారు ఈ కార్యక్రమంలోమాస్టర్ యడ్ల సురేష్, ఇన్ స్ట్రక్టటర్ షేక్ రబ్బానీ, సీనియర్ విద్యార్థులు.పి.సాకేత్, షేక్ కమురుద్దీన్,ఎమ్ సుదీర్ మరియు అకాడమీ విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రొంపిచర్ల ఎస్ఐగా హరిబాబు బాధ్యతలు



**పిడుగురాళ్ల, మేజర్ న్యూస్ :** రొంపిచర్ల పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా ఆవుల హరిబాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన మణి కృష్ణను రాజుపాలెం పోలీస్ స్టేషన్ కు బదిలీ చేశారు. నరసరావుపేట టూ టౌన్ ఎస్ఐ గా పనిచేస్తున్న హరిబాబును వున్నతాధికారులు రొంపిచర్ల పోలీస్ స్టేషన్ స్థానంలో నియమించారు. హరిబాబు పల్నాడు జిల్లాలో పలు పోలీస్ స్టేషన్లలో పనిచేసి మంచి పోలీసు అధికారిగా పేరు ప్రఖ్యాతలు పొంది ఉన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని నూతన ఎస్సై హరిబాబు తెలిపారు.

## రైల్వే ప్రయాణీకులకు శుభవార్త తెలిపిన -కొంక రాధ



**పిడుగురాళ్ల మేజర్ న్యూస్ :** నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఇటీవల రైల్వే అధికారులతో సికింద్రబాద్ లో జరిగిన చర్చల కృషి , సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సభ్యురాలు కొంకా రాధా పలనాడు ప్రజలు గత కొన్ని నెలలుగా ఆకాంక్షిస్తున్న ఎంతో అవసరమైన కొన్ని విలువైన అభ్యర్ధనలు, వందేభారత్ స్టాప్ అభ్యర్ధన సఫలీకృతం కాబోతున్నాయి అనే సంకేతాలు వస్తున్నట్లు కొంక రాదా తెలిపారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు ఈ నెల 16న రైల్వే ఉన్నత అధికారులతో పలనాడు ప్రాంత రైల్వే సమస్యలపై ప్రత్యేకంగా భేటీ అవ్వడం జరిగింది. ఈ భేటీలో పలనాడుప్రాంత రైల్వే సమస్యల చర్చలలో భాగంగా ఎంపీ కొన్ని అత్యవసర సమస్యలపై ప్రస్తావించగా, రైల్వే ఉన్నత అధికారులు వాటిని ఖచ్చితంగా పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వాటిలో భాగంగా, ట్రైన్ నెంబర్ : 20702 తిరుపతి సికింద్రాబాద్20701 సికింద్రాబాద్ తిరుపతి రైళ్లకు అదనంగా 4 బోగీలు మంజూరు అయ్యాయి అని సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు మెంబర్ కొంక రాధా తెలిపారు. అలాగే, వందేభారత్ రైలు కు పిడుగురాళ్ల ఒక బోగి అదనంగా ప్రాంత ప్రయాణీకులకు రిజర్వేషన్ సౌకర్యం కొరకు ఏర్పాటు ప్రక్రియ మరియు వందేభారత్ రైలు పిడుగురాళ్ల స్టాపేజ్ కూడా చివరి దశ అనుమతి ప్రక్రియలో వున్నది అని, త్వరలోనే అనుకూలమైన వార్త పల్నాడు ప్రాంత ప్రయాణీకులకు అందవచ్చు అని సమాచారం ఉంది అని రాధా తెలిపారు. పలనాడు ప్రజలకు రైల్వే వారు ఈ యొక చక్కని రైల్వే సేవలను నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు కృషితో, గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు సూచనలతో రైల్వే అధికారులకు సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సభ్యురాలు కొంకా రాధా చేసిన (వందేభారత్) అభ్యర్ధన త్వరలోనే సఫలీకృతం అవ్వవచ్చు అని సమాచారం ఉన్నట్లు కొంకా రాధా తెలిపారు.

# రైతులకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నాం

## వ్యవసాయ అభివృద్ధికి రూ. 300 కోట్ల బడ్జెట్ కేటాయించాం

- 18 శాతం తేమ ఉన్నా.. పత్తిని కొనుగోలు చేయాలని కేంద్రానికి లేఖ రాశాం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు
- ఎమ్మెల్యే కన్నా, ఎంపీ లావు లతో కలిసి పత్తి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన మంత్రి



**సత్తెనపల్లి మేజర్ న్యూస్ :** ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నామని వ్యవసాయ అభివృద్ధికి రూ. 300 కోట్లను కేటాయించామని వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశు సంవర్ధక, పాడి పరిశ్రమల అభివృద్ధి, మత్స్యశాఖల మంత్రి కింజరపుకింజారాపు అచ్చెన్నాయుడు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఆయనతో పాటు శాసన సభ్యులు కన్నా లక్ష్మి నారాయణ, పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, తెదేపా జిల్లా అధ్యక్షులు కొమ్మలపాటి శ్రీధర్, జిడిసిసి బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు లు ఉన్నారు. మంత్రి కింజారాపు ముందుగా స్థానిక రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక రైతులు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఆయన మాట్లాడుతూ... 11 మార్కెట్ కమిటీలు, 68 జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ ద్వారా కొనుగోళ్లు జరుగుతున్నాయన్నారు. సీసీఐ నిబంధనలతో రైతులు పంట అమ్ముకోలేక ఇబ్బందులు పడుతున్నారని గమనించామన్నారు. 18 శాతం వరకు తేమ ఉన్న పత్తినీ కొనాలని కేంద్రానికి లేఖ రాశామని, రైతులు నాణ్యమైన పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల 40 వేల హెక్టార్లలో పత్తి సాగులో ఉందన్నారు. రైతు సమస్యలపై ముఖ్యమంత్రి గారితో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. కాపస్, కిసాన్ యాప్ తో అనేక ఇబ్బందులు ఉన్నాయని.. రెండు యాప్ లను అనుసంధానం చేస్తున్నామన్నారు.





### వైసీపీ హయంలో రైతులు తీవ్రంగా నష్టం పోయారు...

జగన్ పాలనలో రైతులు ధాన్యం అమ్మాలంటే నానా కష్టాలు పడేవారు. అమ్మిన ధాన్యం డబ్బులు ఎప్పుడు వస్తాయో తెలిసేది కాదని విమర్శించారు. ప్రస్తుతం చంద్రబాబు పాలనలో రైతులు తమకు నచ్చిన మిల్లుల్లో నచ్చిన ధరకు ధాన్యం వాట్సాప్ లోనే అమ్మేయవచ్చు. 24 గంటల్లోనే ధాన్యం డబ్బులు రైతుల ఖాతాల్లో పడిపోతున్నాయని వి వరించారు.పత్తి ,అరటి రైతులకు పచ్చి అబద్దాలు చెబుతున్న మాజీ ముఖ్యమంత్రి జగన్ పై విరుచుకుపడ్డారు. శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ, పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సేవలను, పత్తి కొనుగోళ్లలో రైతులు పడుతున్న ఇబ్బందులను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో జిల్లా, నియోజకవర్గ వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



## అన్న క్యాంటీన్లను పరిశీలించిన కమిషనర్



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** అన్నక్యాంటీన్లలోని సంప్ లు, వాటర్ ట్యాంక్ లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, ఏఈలు వారీగా మెరుగైన పర్యవేక్షణ చేయాలని గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం అర్బీఓ కార్యాలయం, పల్నాడు బస్టాండ్ సెంటర్ లోని అన్న క్యాంటీన్లను కమిషనర్ మధ్యాహ్నం భోజన సమయంలో ఆకస్మికంగా పరిశీలించి, వారితో కలిసి భోజనం చేసి, ప్రజలతో మాట్లాడి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, అన్న క్యాంటీన్లలో ఆహారం తీసుకునేవారి సంఖ్య రోజు రోజుకి పెరుగుతున్నందున, అందుకు తగిన విధంగా పరిశుభ్రత పట్ల సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రధానంగా నీటి సరఫరాకి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆహార సరఫరా అనంతరం ప్రాంగణం శుభ్రం చేయాలని అక్షయపాత్ర సిబ్బందిని ఆదేశించారు. డస్ట్ బిన్లను భోజనం చేసే ప్రాంతానికి దూరంగా ఉంచాలన్నారు. మౌలిక వసతుల కల్పనకు జిఎంసి నోడల్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని అక్షయ పాత్ర సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బి.స్మిత పద్మజ, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



## ఇరువురి బాధితులకు సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



**మంగళగిరి మేజర్ న్యూస్ :** అనారోగ్యంతో బాధపడుతున్న ఇరువురికి వైద్యఖర్చుల కోసం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన ఎల్ఓసీ చెక్కులను మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో టీడీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు స్థానిక నాయకులతో కలిసి మంగళవారం బాధితులకు అందజేశారు. తాడేపల్లి 13 వ వార్డ్ కి చెందిన రావి హరిచందన రూ.1.30లక్షలు, 19 వ వార్డ్ కి చెందిన గంజగుంట్ల భాగ్యలక్ష్మి 1.50 లక్షల లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్ఓసీ) చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటుందన్నారు. అనారోగ్యంకు గురై ఆర్థిక స్తోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు, అభాగ్యులకు అండగా సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసానిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి పట్టణ ప్రధాన కార్యదర్శి దారా దాసు, మాజీ కౌన్సిలర్ కాటాబత్తిని నిర్మల, చల్లా శ్రీనివాస్, చల్లా రంగయ్య, సైకం సాంబయ్య, షేక్ బాజి,ఎస్కె సైదా, దామర్ల దుర్గారావు, కుందుర్తి కోటేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

## మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దు

### - డీఎస్పీ జనార్దనరావు



**తెనాలి మేజర్ న్యూస్ :** మైనర్లకు వాహనాలు నడపడానికి ఇస్తే సీజ్ చేస్తామని డీఎస్పీ జనార్దనరావు హెచ్చరించారు. డీఎస్పీ ఆధ్వర్యంలో త్రీ టౌన్ సీఐ సాంబశివరావు తన సిబ్బందితో కలిసి మంగళవారం రాత్రి వాహనాల తనిఖీ నిర్వహించారు. చెంచుపేట ఉమేష్ చంద్ర విగ్రం సెంటర్ లో వాహనాల తనిఖీలు నిర్వహించారు. మైనర్లు వాహనాలు నడపడం గమనించి వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. తల్లితండ్రులను పిలిపించి వారిని మందలించారు. అనంతరం చంద్రబాబునాయుడు కాలనీ సందర్శించిన ఆ ప్రాంత వాసులకు పలు హెచ్చరికలు చేశారు. ఈ సందర్భంగా సీఐ సాంబశివరావు మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని స్పష్టం చేశారు. యువకులు ఆడపిల్లలను వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం, ధూమపానం చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తామని చెప్పారు. రాత్రి వేళల్లో అనవసరంగా బయట తిరిగితే ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట ఎస్ఐలు కరీముల్లా, ప్రకాశరావు, సిబ్బంది ఉన్నారు.

## వైభవం గా అయ్యప్ప పడిపూజా మహోత్సవం

**యడ్లపాడు (నాదెండ్ల) మేజర్ న్యూస్ :** నాదెండ్ల మండల కేంద్రమైన నాదెండ్ల గ్రామంలో సోమవారం రాత్రి శ్రీ నందికుంట విఘ్నేశ్వర స్వామి వారి ఆలయం వద్ద అయ్యప్ప స్వామి వారి పడిపూజా మహోత్సవం అత్యంత వైభవం గా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా శేకూరు గురుస్వామి జ్ఞాన బ్రహ్మ శ్రీ గుంటుపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్వామి వారికి కలశ పూజ, 18 రకాల ద్రవ్యాలతో అభిషేకం, 18 మెట్లు పడిపూజ, 9 రకాల హారతులు, భజన కార్యక్రమాలతో వైభవంగా జరిగినది. అనంతరం కార్యక్రమానికి హాజరైన స్వాములకు భిక్ష మరియు భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ జరిగింది.

## కుల గౌరవం పేరుతో జరిగే హత్యలు ఆపడంలో ప్రభుత్వం విఫలం




**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** కులాంతర వివాహితులను హత్యల నుండి కాపాడాలని, కుల గౌరవం పేరుతో కడుపున పుట్టిన బిడ్డలను సైతం హత్యలు చేస్తున్నారని కుటుంబంలో వారే పసిబిడ్డలపైన అత్యాచారాలకు పాల్పడుతున్నారని మహిళలపై చిన్నారులపై జరుగుతున్నటువంటి దాడులు, అత్యాచారాలు, హింసను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని అన్నారు హింస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పాత గుంటూరు కోబాల్ట్ పేట లలో హింస వ్యతిరేక దినోత్సవం నివాస ప్రాంతాల్లో జరగడం జరిగింది. మద్యం, మత్తు పదార్థాలు, అశ్లీల వెబ్సైట్లో వల్ల ఈ హింస రోజురోజుకీ పెరిగిపోతుందని మైక్రో ఫైనాన్స్, అధిక వడ్డీల వల్ల కూడా మహిళలపై హింస పెరుగుతుందని దీనికి దీనిని అరికట్టడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని మహిళల్ని కాపాడాల్సిన చట్టాలను నిర్వీర్యం చేస్తున్నారని హత్యలు అత్యాచారాలు చేసిన నిందితులకు శిక్ష పడడంలో జాప్యం జరుగుతుందని ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసిన కేసులు పరిష్కరించడంలో అలసత్వం జరుగుతుందని అన్నారు. మహిళల హక్కుల్ని, చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని మహిళా హక్కులను మానవ హక్కులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఐద్వా నగర కార్యదర్శి ఏ. కళ్యాణి కే. అనురాధ, పిచ్చమ్మ, కుమారి, మునెమ్మ ,నందిని తదితరులు పాల్గొన్నారు.

## నల్లపాడు 2 వ పోలీస్ స్టేషన్ ఏర్పాటు పై దృష్టి

### - ఎమ్మెల్యే బూర్ల



**గుంటూరు జిల్లా క్రైమ్ మేజర్ న్యూస్ :** గుంటూరు రూరల్ మండలం పరిధిలో రెండవ పోలీస్ స్టేషన్ ఏర్పాటు పై దృష్టి సారించినట్లు ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు తెలిపా రు. ప్రతి మంగళవారం ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజా ప్రతినిధులను కోరారు. ఈ నేపద్యంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు గుంటూరు పశ్చిమ తహసిల్దార్ కార్యాలయం, అడవి తక్కెళ్ళపాడు నల్లపాడు పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా సందర్శించారు. తహసిల్దార్ వెంకటేశ్వరరావు తో మాట్లాడారు. కార్యాలయానికి వచ్చే అర్జీదారులకు సత్వర సేవలు అందించాలని సూచించారు. నల్లపాడు పోలీస్ స్టేషన్ సిఐ వంశీధర్ తో మాట్లాడారు. చిన్న కేసులను సాధ్యవంతమైన వరకు ఇరువర్గాల సమ్మతితో రాజీ చేసి పంపించాలని సూచించారు. స్టేషన్ పరిధి ఎక్కువ కావడంతో సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. సిబ్బంది కొరత వల్ల ఇబ్బందులు వస్తున్నాయని సిఐ వంశీధర్ ఎమ్మెల్యే కు వివరించారు. కరోనా సమయంలో నల్లపాడు స్టేషన్ రెండు భాగాలుగా విభజించారని... మరలా ఒక్కటిగా చేశారని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఎమ్మెల్యే అనుకూలంగా స్పందించారు. స్టేషన్ ఒక ప్రాంతం వైపు ఉండటంవల్ల జాతీయ రహదారి ప్రాంతం గ్రామాలకు సుదూరంగా ఉన్నట్లు తెలుస్తోంది. రెండవ స్టేషన్ విషయంపై హోం మంత్రితో మాట్లాడాను. త్వరలో సమస్య పరిష్కారం అవుతుందని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. మొదట ఎమ్మెల్యే అంబేద్కర్ భవన్, టిడ్కో గృహాలను సందర్శించారు. ఆ ప్రాంత వాసులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఈ సందర్భంగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. టిడ్కో గృహాల ప్రాంతంలో రాత్రులు గస్తీ చేయాలని ఎమ్మెల్యే సిఐ కి సూచించారు.

## కృష్ణవేణి డిగ్రీ కాలేజీలో వాలీబాల్ టోర్నమెంట్



### ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించిన నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు

**నరసరావుపేట రూరల్ మేజర్ న్యూస్:** నరసరావుపేటలోని చిలకలూరిపేట రోడ్డులో ఉన్న కృష్ణవేణి డిగ్రీ కాలేజీలో మంగళవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఇంటర్ కాలేజియేట్ వాలీబాల్ (పురుషులు) టోర్నమెంట్ -2025 (ఆనిక్ వాలీబాల్ మ్యాన్ టోర్నమెంట్ -2025) కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు పాల్గొని టోర్నీని ప్రారంభించారు. ఆటగాళ్లను ఉత్సాహపరి చారు. విద్యార్థులలో క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించడం శారీరక దృఢత్వం సాధించడం ఈ విధమైన కార్యక్రమాల ద్వారానే సాధ్యమని అన్నారు. ఈ టోర్నమెంట్‌లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న వివిధ కాలేజీల నుంచి పలు జట్లు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో కాలేజీ అధ్యక్షులు ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## నవశక్తి క్షేత్రంలో చోరీ

**పెదకాకాని మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన పెదకాకాని పరిధిలోని వెనిగండ్ల అగతవరప్పాడు రోడ్డు మార్గంలో ఉన్న నవశక్తి క్షేత్రంలో సోమవారం రాత్రి చోరీ జరిగినట్లు పెదకాకాని పోలీసులు తెలిపారు ఆలయంలో సుమారు పదివేల రూపాయలు నగదు 50 గ్రాములు బంగారం చోరీకి గురైనట్లు ఫిర్యాదు అందినట్లు పెదకాకాని పోలీసులు తెలిపారు ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

## ప్రభుత్వ పథకాలపై అవగాహన కోసమే రైతన్నా మీ కోసం..



**గుంటూరు, కలెక్టరేట్ మేజర్ న్యూస్:** రైతన్నా మీ కోసం కార్యక్రమం రెండవ రోజు మంగళవారం వివిధ గ్రామాల్లో జరిగింది. జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు మండల స్థాయిలో విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించి, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. రైతులు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఐదు సూత్రాలపై అవగాహన చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతాంగం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన నీటి భద్రత, వ్యవసాయ సాంకేతికత, వ్యవసాయం ఆహార సంస్కరణ ప్రభుత్వ మద్దతు అనే ఐదు అంశాలు పై రైతులకు వివరించారు. రైతులు మొబైల్లో యాప్ లో చేసే విధానమును పరిశీలించారు. రైతుల జీవనోపాధి, ఆర్థిక స్థితి, నైపుణ్యాభివృద్ధితో అంచనావేసి రైతుల్లో శాశ్వత మార్పు తీసుకురావడం లక్ష్యంగా ప్రభుత్వం రైతన్న ఇంటింటా మీకోసం సర్వే కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ నెల 24 నుండి 29 వ తేదీ వరకు జరిగే వ్యవసాయ అనుబంధ శాఖ సిబ్బందితో ఇంటింటా సర్వే కార్యక్రమమును రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అన్నదాత సుఖీభవ అర్హులైన వారి ఖాతాల్లో జమ అయినదా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రైతు సెల్ ఫోనులో యాప్ ను ఇన్స్టాల్ చేయాలని ఇంటింటా సర్వే చేస్తున్న సిబ్బందిని ఆదేశించారు. పంటల్లో ఎదురవుతున్న సమస్యలను తెలుసుకున్నారు.

## ఉద్యోగ నియామక పత్రాలు అందజేసిన చైర్పర్సన్ క్రిస్టినా



గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :జిల్లాపరిషత్ కార్యాలయంలో మంగళవారం చైర్ పర్సన్ కత్తెర హెని క్రిస్టినా కారుణ్య నియామకాల ప్రక్రియ ద్వారా జి.శ్రీనివాస గౌడ్ కు ఆఫీసు సబర్డినేట్ గా నియామక ఉత్తర్వులు అందజేశారు. జి.శ్రీనివాస గౌడ్ ను పల్నాడు జిల్లా ఎంపీపీ క్రోసూరు నందు ఆఫీసు సబార్డినేట్ గా నియామక ఉత్తర్వులు అందజేశారు.చైర్ పర్సన్ క్రిస్టినా మాట్లాడుతూ నూతన సంవత్సరం ఒక మంచి పనితో ప్రారంభించడం చాలా ఆనందం గా వుంది అని అన్నారు, క్రొత్తగా ఉద్యోగాలు పొందిన వారు కష్టపడి పని చేయాలి అని, తప్పకుండా సి సి ఏ నిబంధనలు తప్పని సరిగా తెలుసుకొని పాటించాలి అని, ఆఫీసు లో ఇతర ఉద్యోగులతో మంచిగా ప్రవర్తించాలి అని, మీ తల్లి దండ్రులకు మంచి పేరు తీసుకురావాలి అని తెలియజేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో జ్యోతి బసు , అకౌంట్స్ ఆఫీసర్ సామ్యూల్ పాల్ ఎ సెక్షన్ ఏ వో రాజా రత్నబాబు పాల్గొన్నారు.

## నేడు వీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలికలకు సైకిళ్ళ పంపిణీ కార్యక్రమం




**పిడుగురాళ్ల మేజర్ న్యూస్ :** వసుధైక కుటుంబం అనే మహత్తర సూత్రాన్ని ఆధారంగా చేసుకుని పనిచేస్తున్న వీకే యూనివర్సల్ ఫ్యామిలీ ఫౌండేషన్ ( వీకే - యు ఎఫ్ ఎఫ్ ), నవంబర్ 26వ తేదీన పాల్నాడు జిల్లా పిడుగురాళ్ళ మన్నెం పుల్లా రెడ్డి జిల్లా పరిషత్ హై స్కూల్లో ప్రత్యేక సైకిల్ పంపిణీ కార్యక్రమంను నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంద్వారా పిడుగురాళ్ల క్లస్టర్‌లోని 10 ప్రభుత్వ పాఠశాలల నుండి ఎంపికైన తల్లి మాత్రమే ఉన్న విద్యార్థినులు, తల్లిదండ్రుల్లేని బాలికలకు మాత్రమే 50 సైకిళ్లు అందజేయబడుతున్నాయి. ఈ కార్యక్రమానికి క్రాజ్బీటయే సర్వీసెస్ లిమిటెడ్ (బెంగళూరు) సంస్థ సహకారంతో2025 సంవత్సరంలో వీకే ఫౌండేషన్ ప్రభావంఈ సంవత్సరం మొత్తం రూ. 25 లక్షల రూపాయలువిలువైన 500 సైకిళ్లు బాలికలకు పంపిణీ, 150 మంది బాలికలకు నెలవారీ విద్యా వేతనాలు అందించడం జరుగుతుంది. దాతల విరాళం నేరుగా విద్యార్థులకే దక్షిణ భారతదేశంలోని నాలుగు రాష్ట్రాల్లో సేవలు అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, జిల్లా విద్యాశాఖ అధికారిణి చంద్రకళ, వీకే ఫౌండేషన్ డైరెక్టర్ జనకిరామారావు రేళ్ళ, పాఠశాలల హెడ్ మాస్టర్, ఉపాధ్యాయులు, వీకే - యు ఎఫ్ ఎఫ్ వాలంటీర్లు, కమిటీ సభ్యులు పాల్గొంటారు. ఈ కార్యక్రమ ముఖ్యాంశాలు... బాలికలకు సైకిల్ పంపిణీ వీకే టీ-షర్ట్ల పంపిణీ, బాలికలు, తల్లిదండ్రులతో పరస్పర చర్చ,వీకే ఫౌండేషన్ అందిస్తున్న స్కాలర్‌షిప్, విద్యా సహాయం వివరాలు వీకే ఫౌండేషన్ సందేశం"**వీకే అంటే వసుధయిక కుటుంబం**" ා ప్రపంచమే ఒక కుటుంబం అన్న భావన. రవాణా సమస్యలు లేదా కుటుంబ పరిస్థితుల కారణంగా విద్య ఆగిపోకుండా, ప్రతి బాలిక చదువు నిరంతరంగా కొనసాగేందుకు సహాయం చేయడం మా ధ్యేయం."

**వీకే యూనివర్సల్ ఫ్యామిలీ ఫౌండేషన్ గురించి**

**ఫౌండేషన్ సేవలు అందించే వర్గాలు:**

తల్లిదండ్రులలో ఒకరే ఉన్న పిల్లలు,తల్లిదండ్రుల్లేని పిల్లలు, ప్రధాన ఆధారం కోల్పోయిన కుటుంబాలు, ఆర్థికంగా వెనుకబడిన బాలికలు.

నెలవారీ ప్రగతి పర్యవేక్షణ, మెంటర్‌షిప్, కుటుంబ సందర్శనలు, పాఠశాలలతో సమన్వయం వంటి పద్ధతుల ద్వారా సమగ్ర విద్యా సహాయం అందిస్తోంది.

## సక్రమంగా నిర్వహించకపోతే.. చర్యలు తప్పవు

### అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించిన సిడిపిఓ శ్రీలత



**సత్తెనపల్లి మేజర్ న్యూస్ :** అంగన్వాడి కేంద్రాల నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని (చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్) సిడిపిఓ శ్రీలత హెచ్చరించారు. మంగళవారం ముప్పాళ్ళ మండల పరిధిలోని చాగంటివారిపాలెం గ్రామంలోని అంగన్వాడి కేంద్రాలను ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీలో ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో పరిశీలించారు. అంగన్వాడి సేవలపై ఫిర్యాదులు రావడంతో తనిఖీ చేశారు. రికార్డులో నమోదు చేసిన హాజరును, పిల్లల సంఖ్యను,పోషకాహారాన్ని, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులను తల్లిదండ్రుల కంటే ఎక్కువ బాధ్యతగా చూసుకోవాలని సూచించారు. ఆమెతోపాటు ముప్పాళ్ళ సెక్టార్ పర్యవేక్షకులు అనంతలక్ష్మి తదితరులు ఉన్నారు.

## మంత్రి నారా లోకేష్ చొరవతో మంగళగిరి "చేనేత కాలనీ"భూమి పై నిషేధం ఎత్తివేత

### దామర్ల రమాకాంతరావు చేనేత కాలనీవాసుల అండగా నిలిచిన లోకేష్ టిడిపి రాష్ట్ర నేత గుత్తికొండ ధనుంజయరావు

**మంగళగిరి, మేజర్ న్యూస్:** గత వైసిపి ప్రభుత్వం మంగళగిరి 9వ వార్డు పరిధిలో ఉన్న దామర్ల రమాకాంతరావు చేనేత కాలనీ లో 100 ఇళ్లకు సంబంధించి భూమిపై 22 %ఋ% యాక్టు తీసుకొచ్చి చేనేత కాలనీ వాసులు ఎటువంటి రిజిస్ట్రేషన్లు చేయించుకోవటానికి వీలు లేకుండా వైసిపి ప్రభుత్వం, అప్పటి ఎమ్మెల్యే ఆర్ కె ఈ యాక్ట్ ను పెట్టించి కాలనీవాసుల ను మానసిక క్షోభకు గురి చేశారని తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు అన్నారు. ఎన్నికల ముందు 8, 9 వార్డులలో ఏర్పాటుచేసిన రచ్చబండ కార్యక్రమంలో చేనేత కాలనీ వాసులకు నారా లోకేష్ గారు 22 ఏ యాక్టు నుండి విముక్తి కలిగిస్తానని దానిపై పోరాటం చేస్తానని వారికి హామీ ఇచ్చారు. ఆ ఇచ్చిన హామీ మేరకు నేడు జిల్లా కలెక్టర్, మరియు హ్యాండ్లూమ్ కమిషనర్ తో మాట్లాడి చేనేత కాలనీవాసుల కోరిక నెరవేరుస్తూ 22 ఏ యాక్టు నుండి విముక్తి కల్పించి వారికి అండగా నిలిచారని ధనుంజయరావు అన్నారు. ఈ సందర్భంగా నారా లోకేష్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేశారు.

## లేబర్ కోడ్లను రద్దు చేయాలి పిడియం రాష్ట్ర నాయకులు



**నరసరావుపేట మేజర్ న్యూస్ :**రైతులు కార్మికులు వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం రేపు ఉదయం 10 గంటలకు నరసరావుపేట మార్కెట్ యార్డ్ వద్ద నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు కార్మిక కర్షక ఐక్యతా బైక్ ర్యాలీ జయప్రదం చేయాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మునిసిపల్ బంగ్లాలో కరపత్రాల ఆవిష్కరణ జరిగింది ఈ సందర్భంగా పిడియం రాష్ట్ర నాయకులు వై వెంకటేశ్వరరావు ఎం సి పి ఐ (యు) జిల్లా కార్యదర్శి షేక్ మొహిద్దీన్ భాష లు మాట్లాడుతూ చారిత్రాత్మక రైతాంగ పోరాటం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఇప్పటికీ నెరవేర్చకుండా రైతాంగానికి నష్ట దాకా ఏమైనా మూడు రైతు చట్టాలను విద్యుత్ సవరణ బిల్లును దొడ్డిదారిన అమల్లోకి చేయడాన్ని మరియు కార్మిక వర్గాన్ని యజమానులు పెట్టుబడిదారు లకు బానిసలు చేసే విధంగా తీసుకువచ్చిన లేబర్ కోడ్లను రద్దు చేయాలని గత నాలుగు సంవత్సరములు గా ఆందోళన చేస్తున్న పట్టించుకోకుండా కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం పూనుకోవడం దుర్మార్గమని కార్మిక రైతాంగానికి నట్టదాయకమైన విధానాలు అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా రేపు అనగా బుధవారం ఉదయం 10 గంటలకు నరసరావుపేట మార్కెట్ యార్డ్ వద్ద నుండి కలెక్టర్ కార్యాలయం వద్దకు కార్మిక కర్షక బైకు ర్యాలీ జరుగుతుందని ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో కార్మికులు రైతులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ సిలార్ మసూద్ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్ పాల్ గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు కోటా నాయక్, శ్రీను నాయక్ పిడియం నాయకులు రామకృష్ణ నల్లపాటి రామారావు సికినం చిన్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ప్రసన్నకుమార్ ప్రజా కళా మండలి రాష్ట్ర నాయకురాలు రాణి తదితరులు పాల్గొన్నారు.



## చిన్నారుల దత్తత చట్ట ప్రకారం ఉండాలి..

### జిల్లా బాలల సంరక్షణ అధికారి ప్రశాంత్ కుమార్



**పిడుగురాళ్ల మేజర్ న్యూస్ :** పిల్లలు లేని దంపతులు చట్ట ప్రకారం దత్తత తీసుకోవాలని( డిసిపిఓ) జిల్లా బాలల సంరక్షణ అధికారి ప్రశాంత్ కుమార్ అన్నారు. అంతర్జాతీయ దత్తత మాసోత్సవాల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం పిడుగురాళ్ల ఐసిడిఎస్ పరిధిలోని పట్టణంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పిల్లల ను అధికారకంగా దత్తత తీసుకోవడంపై నెలరోజులపాటు సదస్సులు, సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించటం జరుగుతుందన్నారు. జీరో నుంచి 18 సంవత్సరాల లోపు పిల్లలను ఎవరైనా అనధికారిక దత్తత తీసుకున్నట్లయితే 1098 చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ కు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ సమావేశానికి పిడుగురాళ్ల ప్రాజెక్టు సిడిపిఓ పి రాజేశ్వరి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అనధికార దత్తత నేరమన్నారు. బాల్యవివాహాలు జరగకుండా అవగాహన కల్పించాలన్నారు. బాల్యవివాహాలు చేసుకున్న తర్వాత జరిగే పరిణామాలు బాలికకు జరిగే నష్టాలు పట్ల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు.సట్టారీత్యా నేరమనే బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని ఈ విషయం అందరికీ తెలియజేయాలన్నారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమనే విషయం అందరికీ తెలియజేయాలన్నారు. నూతనంగా వివాహం చేసుకున్న దంపతుల వివరాలను ఆన్ లైన్ లో ఎక్కించాలని, అలా ఎక్కించకపోతే ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే సంక్షేమ పథకాలను కోల్పోతారన్నారు. ఈ సమావేశంలో డిసిపిఓ ప్రశాంత్ కుమార్, పిడుగురాళ్ల సిడిపిఓ పి రాజేశ్వరి, సూపర్వైజర్లు ఎస్ నాగమణి, వెంకటలక్ష్మి ఏ, పి అంజలి, కె కోటేశ్వరి, అంగన్వాడి కార్యకర్తలు, ఏఎన్ఎంలు,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## నవంబర్ 26న కార్మిక కర్షక నిరసన ర్యాలీని జయప్రదం చేయండి

### ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాసా రాంబాబు పిలుపు

- **లేబర్ కోడ్స్ ని రద్దు చేయాలి**
- **కార్మిక చట్టాల్ని పునరుద్ధరించాలి**
- **రైతాంగాన్ని తక్షణమే ఆదుకోవాలి**

**నరసరావుపేట మేజర్ న్యూస్ :**ఏఐటియుసి నవంబర్ 26వ తేదీన కార్మిక కర్షక ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమం జరుగుతుందని అందరు పాల్గొని జయప్రదం చేయాలని ఏఐటియు సి పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కాసా రాంబాబు పిలుపునిచ్చారు. కాసా రాంబాబు మాట్లాడుతూ నవంబర్ 26వ తేదీన ఉదయం 10 గంటలకు బస్టాండ్ దగ్గర నుండి కలెక్టరేట్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ జరుగుతుందని ఈ కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు పాల్గొన్నారని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అనుసరిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలపైన వివరిస్తారని ర్యాలీనిజయప్రదం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి కార్య నిర్వహణ జిల్లాఅధ్యక్షులు ఉప్పలపాటి రంగయ్య ఏఐటియుసిన కోయి శీను రైతు సంఘం నాయకులు చిట్యాల శ్రీనివాసరెడ్డి రొడ్డ అంజిరెడ్డితదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 27న నూర్ మసీద్ ను ప్రారంభించనున్న

### - మంత్రి లోకేష్



**మంగళగిరి, మేజర్ న్యూస్:** మంగళగిరి ఆర్టీసీ డిపో వద్ద పావురాల కాలనీలో సుమారు రెండు కోట్ల రూపాయలు వ్యయంతో నూతనంగా నిర్మాణం జరిగిన నూర్ మసీద్ ను ఈనెల 27వ తేదీన ప్రారంభించడం జరుగుతుందని హాజీ షేక్ నాగుల మీరా, మసీదు వ్యవస్థాపక అధ్యక్షులు షేక్ మహమ్మద్ అలీ తెలిపారు. ఈ మేరకు మంగళవారం మసీదులో దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ఐటీ, విద్య, మానవ వనరులు శాఖ మంత్రివర్యులు నారా లోకేష్ హాజరై మసీదును ప్రారంభిస్తారన్నారు. తమ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. గౌతమ బుద్ధ రోడ్డులో 14 సంవత్సరాలు నుంచి ఉన్న మసీదు ను రోడ్డు విస్తరణలో తొలగించి, తిరిగి ప్రభుత్వం ఏడు సెంట్లు స్థలం కేటాయించడం జరిగిందన్నారు. సుమారు రెండు కోట్ల రూపాయల వ్యయంతో ఆధునిక వసతులతో లిఫ్ట్ సౌకర్యంతో మూడు అంతస్తులలో మసీదు నిర్మాణం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ ప్రతినిధులు షేక్ మహమ్మద్ జానీ, మహమ్మద్ ఫిరోజ్, షేక్ సౌఖత్ అలీ, షాహిద్ అలీ, జాఫర్, నజీర్, ఆసిఫ్, అబ్దుల్లా కుట్టి పాల్గొన్నారు.

## కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవ కార్యక్రమం లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు







**నరసరావుపేట రూరల్ మేజర్ న్యూస్:** అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నరసరావుపేటలోని కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు మార్గదర్శక ప్రసంగం చేశారు. కళాశాల డైరెక్టర్ నాతాని వెంకటేశ్వర్లు, అధ్యాపకులు, విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా స్త్రీలపై జరుగుతున్న హింసలను అరికట్టడానికి అవగాహన కల్పించారు. విద్యార్థినులు నాటకాలు డ్రామాలు, చర్చా సెషన్లు నిర్వహించి, గృహ హింస, లైంగిక వేధింపులు, డిజిటల్ హింస మొదలైన అంశాలపై చర్చించారు. ఆరంజ్ ద వరల్డ్ ప్రచారంలో భాగంగా కళాశాల ఆవరణాన్ని నారింజ రంగులతో అలంకరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నవంబర్ 25 అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవం మనందరినీ ఒక్కటి చేస్తుంది. ఈ దినోత్సవం ప్రాధాన్యత అపారమైనది. 1960లో డొమినికన్ రిపబ్లిక్‌లో మిరాబల్ సోదరీయుల త్యాగాన్ని గుర్తుచేసుకుంటూ 1999లో ఐక్యరాజ్యసమితి నవంబర్ 25 ను అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవంగా ప్రకటించింది.ఇది మన సమాజంలో మార్పుకు పునాది. హింస లేని సమాజం కోసం మనం కలిసి పోరాడాలి. ఈ దినోత్సవం మనల్ని హింసను గుర్తించడానికి, నిరోధించడానికి, బాధితులకు మద్దతు ఇవ్వడానికి ప్రేరేపిస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం స్త్రీల అభివృద్ధికి, రక్షణకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. దుల్హన స్కీం ద్వారా వివాహాలకు ఆర్థిక సహాయం, యమన్ గౌరవమ్ కింద బాలికల విద్యకు ప్రోత్సాహం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటివి మహిళల ఆర్థిక స్వావలంబనకు దోహదపడుతున్నాయి. స్త్రీ రక్షణ కోసం పోక్సో చట్టం, డొమెస్టిక్ వయాలెన్స్ యాక్ట్, పోష్ చట్టాలు బలపడ్డాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో మిషన్ శక్తి, వన్ స్టాప్ సెంటర్లు, 181 విమెన్ హెల్ప్‌లైన్ ద్వారా బాధిత మహిళలకు తక్షణ సహాయం అందిస్తున్నాం. డిజిటల్ హింసను అరికట్టడానికి సైబర్ క్రైమ్ సెల్స్‌లు ఏర్పాటు చేశాం.విద్యార్థులారా మీరు ఈ దినోత్సవం ప్రాధాన్యతను అర్థం చేసుకోండి. చదువులో ముందుండండి, క్రీడల్లో రాణించండి. మీరు భవిష్యత్ నిర్మాతలు. స్త్రీల సామర్థ్యవంత మైన సమాజాన్ని నిర్మించండి. హింసకు వ్యతిరేకంగా మీ కార్యకలాపాలు చేయండి. మనం కలిసి స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవం ప్రచారాల్లో చురుకుగా పాల్గొందాం. స్త్రీలు సురక్షితంగా, సమానంగా జీవించే రోజులు ముందున్నాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి డిగ్రీ కళాశాల అధ్యాపకులు, డైరెక్టర్లు, ఉమ్మడి కూటమి నాయకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో 50 కోట్లు రైతులకు అన్నదాత సుఖీభవ లబ్ధి

### - వైసీపీ ప్రభుత్వం రైతులను అరాచక చేసింది

### - రాష్ట్ర నిర్మాణానికి రైతు పునాది

**మాచవరం మేజర్ న్యూస్ :** గురజాల నియోజకవర్గంలో 50 కోట్లు రైతులకు రైతు సుఖీభవ ద్వారా కోటం ప్రభుత్వం అందించడం జరిగిందని గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కొత్త గణేష్ పాడు గ్రామంలో రైతన్న.... మీకోసం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సభాధ్యక్షులుగా టిడిపి మండల కన్వీనర్ బడి గుంచల వెంకటేశ్వర్లు వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు, రైతుల జీవితాలకు కొత్త దిశనిచ్చేందుకు వ్యవసాయంలో పంచ సూత్రాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు అన్నదాత సుఖీభవ ఇంటింటి ప్రచారంలో భాగంగా నిర్వహిస్తున్న వినూత్న కార్యక్రమమే "రైతన్నా.. మీకోసం" రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం మాచవరం మండలం కొత్తగణేశునిపాడు గ్రామం నందు ఇంటింటికి తిరిగి రైతులకు కరపత్రాలను అందించి వ్యవసాయంలో పంచ సూత్రాల అమలు గురించి రైతులకు వివరించడం జరిగింది. ఆయన అన్నారు. సమావేశం ఆవరణలో ప్రకృతి వ్యవసాయంపై స్టాల్స్ ని ఏర్పాటు చేశారు. రైతన్న మీకోసం కార్యక్రమం గురించి గురజాల నియోజకవర్గ పరిశీలకులు కల్లం రాజశేఖర్ రెడ్డి, పల్నాడు జిల్లా ఎస్.సి ఎల్



అధ్యక్షులు స్టేట్ ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ సాతులూరి కుమార్, వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ నాగమల్లేశ్వరరావు, ఎండిఓ విష్ణు చిరంజీవి, ఉద్యాన శాఖ అధికారిని అరుణ భాయ్, నరసరావుపేట రైతు సంఘం ఉపాధ్యక్షులు దున్న చెన్నై చౌదరి, మాచవరం క్లస్టర్ ఇంచార్జ్ ఎడ్లపల్లి రామారావు,గ్రామ సర్పంచులు పొందూరి నరసింహారావు, పల్లా నరేంద్ర, మాజీ సర్పంచ్ చల్లగుండ్ల బిక్షమయ్య, మహిళలు రైతులు కూ టమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

### - ట్రాఫిక్ డిఎస్పి శ్రీనివాసరావు



**గుంటూరు జిల్లా క్రైమ్ మేజర్ న్యూస్ :** మార్గ భద్రతపై అవగాహనను విస్తృతం చేసే లక్ష్యంతో, గుంటూరు జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ఈ రోజు మహిళా కళాశాలలో ప్రత్యేకంగా విద్యార్థినుల కోసం ట్రాఫిక్ అవగాహన సదస్సును విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుమారు 250 మందికి పైగా విద్యార్థినులు హాజరయ్యారు. ఈ అవగాహన సదస్సులో ట్రాఫిక్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ బెల్లం శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని, విద్యార్థినులకు రోడ్డు భద్రతా నియమాలు మరియు ట్రాఫిక్ ఉల్లంఘనల గురించి వివరించారు. ఈ కార్యక్రమాన్ని ఈస్ట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పర్యవేక్షించారు. ట్రాఫిక్ డి.ఎస్.పి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ రహదారిపై బాధ్యతాయుతమైన పౌరులుగా వ్యవహరించాలని కోరారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలు నడిపే విద్యార్థినులకు ఈ కింది అంశాలపై అవగాహన కల్పించారు: తప్పనిసరి హెల్మెట్: ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు, వెనుక కూర్చున్నవారు కూడా ఐ.ఎస్.ఐ (%×ా×%) మార్కు గల హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలి. లైసెన్స్ మరియు పత్రాలు: ప్రతి ఒక్కరూ వాహనానికి సంబంధించిన డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ (%=జ%) పత్రాలు వంటి వాటిని ఎల్లప్పుడూ వెంట ఉంచుకోవాలి. ట్రిపుల్ రైడింగ్ నిషేధం: వాహనంపై ముగ్గురు ప్రయాణించడం (ట్రిపుల్ రైడింగ్) వలన కలిగే ప్రమాదాలను, దానిపై ఉండే కఠిన చర్యలను వివరించారు. సెల్ ఫోన్ వినియోగం: డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్ ఫోన్ మాట్లాడటం లేదా వాడటం పూర్తిగా నిషేధం అని, ఇది ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. పాదచారుల భద్రత: రోడ్లపై నడిచేటప్పుడు మరియు దాటేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, జీబ్రా క్రాసింగ్‌ల వినియోగంపై సూచనలు ఇచ్చారు. ట్రాఫిక్ డి.ఎస్.పి మాట్లాడుతూ, మహిళలు స్వతహాగా డ్రైవింగ్ నేర్చుకొని బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని, తద్వారా తమ భద్రతను తామే కాపాడుకోవాలని సందేశం ఇచ్చారు. రోడ్డు భద్రతా నిబంధనలను పాటించడం కేవలం చట్టం కోసం కాదని, వ్యక్తిగత భద్రత కోసమేనని ఆయన ఉద్ఘాటించారు. ట్రాఫిక్ సిఐ ఆకుల అశోక్ కుమార్ మాట్లాడుతూ, "ట్రాఫిక్ నిబంధనల పట్ల ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. హెల్మెట్ మరియు సీటు బెల్ట్ ధరించడం, రోడ్లపై అడ్డంగా పార్కింగ్ చేయకుండా ఉండటం లాంటి చట్ట ఉల్లంఘనలకు దూరంగా ఉండటం ద్వారా మాత్రమే ప్రమాదాలను తగ్గించగలం," అని తెలిపారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారం పోలీసుల ఒక్కరి బాధ్యత కాదని, ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని ఆయన కోరారు. ఈ అవగాహన సదస్సును విజయవంతం చేసిన కళాశాల యాజమాన్యానికి, హాజరైన విద్యార్థినులకు ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## పేదలకు ఇండ్ల పట్టాలు ఇచ్చేవరకు దశల వారి ఆందోళన – సిపిఎం

**పెదకాకాని మేజర్ న్యూస్ :** పెదకాకాని మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో ప్రభుత్వ భూముల్లో ఇండ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్న పేదలకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలని నిరసన ప్రదర్శన చేశారు ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా ప్రభుత్వ భూములలో ఇండ్లు నిర్మించుకొని నిర్వాసముంటున్న సుందరయ్య కాలనీ స్వర్ణ పూరి కాలనీ ఎన్టీఆర్ కాలనీ వడ్డెర కాలనీ జాన్ ఆర్స్ ఫర్ కాలనీ ఎస్టీ కాలనీ లలో నివాసం ఉంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని మండలంలో ఇండ్ల స్థలం లేని పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని గత ప్రభుత్వం హయాంలో రాజధానిలో ఇండ్ల స్థలాలు ఇస్తాము అని ఆనాడు కొంతమందికి పట్టాలు ఇచ్చారు ల్యాండ్ కేటాయించలేదు రాజధానిలో కేటాయించిన ల్యాండ్ వివాదంగా కోర్టు పరిధిలో ఉన్నది అని చెబుతున్నారు ప్రభుత్వం కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలాగా తిరిగినా స్థానిక శాసనసభ్యులని అడిగినా ఇండ్ల స్థలాల పట్టాలు ఇవ్వడం లేదని ఇప్పటికైనా అరకులైన పేదలందరకి ఏ గ్రామంలో అయితే నివాసం ఉంటున్నా రో ఆ గ్రామంలోని పట్టాలు ఇవ్వాలని కాలనీలలో రోడ్లు డ్రైనేజీ తాగునీరు మాలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో సిపిఎం శాఖా కార్యదర్శి బి బాబురావు బురద గుంట సాంబయ్య కే రాఘవయ్య ఆర్ వెంకటరమణ జెట్టి రాజలక్ష్మి ఎంకాయమ్మ షేక్ మరింబి పి మరియమ్మ ఏ పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

## పెదకాకానిలో పబ్లిక్ టాయిలెట్ల ఏర్పాటు చేయాలి

**పెదకాకాని మేజర్ న్యూస్ :** పెదకాకాని మండల కేంద్రంలో మూడు ప్రధాన పుణ్యక్షేత్రాలు ఉండటంతో ప్రతి వారము వేలాది మంది భక్తులు ఇక్కడికి విచ్చేస్తున్నారని సీపీఐ పొన్నూరు నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ తెలిపారు. అయితే భక్తులకు, ముఖ్యంగా మహిళలకు, పెదకాకాని గ్రామంలో ఎటువంటి పబ్లిక్ మరుగుదొడ్ల నిర్మాణం లాంటి ప్రాథమిక సౌకర్యాలు లేకపోవడం వలన తీవ్ర అసౌకర్యానికి కారణమవుతోందన్నారు. యాత్రికులు ఇబ్బంది పడుతున్న సమయంలో గ్రామ ప్రజలను టాయిలెట్లు ఎక్కడ ఉన్నాయని అడిగి లేవని తెలుసుకొని ఇబ్బంది పడుతున్నారని మరీ ముఖ్యంగా ఆడపడుచులు అనేక ఇబ్బందులు ఎదుర్కొనవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు, గ్రామంలోని మహిళలు పురుషులు తమ అవసరాల కొరకు పెదకాకాని సెంటర్ కు వచ్చిన తరుణంలో మూత్ర విసర్జన చేయుటకు కూడా వీలులేని పరిస్థితులలో నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు స్థానిక మహిళలు వెంటనే మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారని తెలిపారు. ఈ సమస్యను అత్యవసరం గా పరిగణించి సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## పెదకాకానిలో రైతన్న మీకోసం కార్యక్రమం

**పెదకాకాని మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో పంచ సూత్రాలతో లాభసాటి వ్యవసాయ విధానాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు “ రైతన్నా.. మీకోసం” కార్యక్రమంలో భాగంగా పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ సూచనలు మేరకు పెదకాకాని మండలం వ్యవసాయ అధికారులు, మరియు రైతు భరోసా సిబ్బంది కలిసి రైతన్న ఇంటికెళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబు గారు రైతులకు రాసిన లేఖను కరపత్రం రూపంలో అందజేశారు కార్యక్రమంలో పెదకాకాని మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వలివేటి మురళీకృష్ణ మరియు పార్టీ రైతు విభాగం నాయకులు పాల్గొన్నారు.

## మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి – జడ్జి టీ ప్రవళిక




**మాచవరం మేజర్ న్యూస్ :** మహిళా చట్టాలపై మహిళలు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని పిడుగురాళ్ల జూనియర్ సివిల్ కోర్టు జడ్జి టీ ప్రవళిక అన్నారు. మంగళవారం మాచవరం సచివాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు ఈ సందర్భంగా జడ్జి ప్రవళిక మాట్లాడుతూ మహిళలపై అత్యాచారాలు దాడులు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు అలాగే చట్టాలపై అవగాహన కలిగి ఉంటే ఎటువంటి సమస్యనైనా సులువుగా పరిష్కరించుకోవచ్చు అన్నారు అలాగే డిసెంబర్ 13వ తేదీన పిడుగురాళ్ల కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జడ్జి ప్రవళిక తెలిపారు. ఈ కార్యక్రమంలో మాచవరం ఎస్సై తిరుపతిరావు అడ్వకేట్లు నవ్య వెలిశాల రామకృష్ణ పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్ కోటేశ్వరరావు సచివాలయం సిబ్బంది పోలీస్ స్టేషన్ సిబ్బంది కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.